


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 14-07-2022 సంపుటి: 03 సంచిక: 289 పేజీలు: 4 వెల: రూ 3-00




## ఆగస్టు 15 నుంచి 'ఫ్యామిలీ డాకర్ట్'..

# ఆరోగ్యశ్రీ ద్వారా మరిన్ని చికిత్సలు: సీఎం జగన్

అమరావతి: ఆరోగ్యశ్రీ ద్వారా అందించే చికిత్సల జాబితాను పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. బుధవారం వైద్య ఆరోగ్యశాఖపై తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఆగస్టు 1వ తేదీ నుంచి పెంచిన చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, ఆగస్టు 15 నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం జగన్ ఆదేశించారు. విలేజ్ క్లినిక్స్‌కు, పీహెచ్‌సీలకు డిజిటల్ వీడియో అనుసంధానత ఉండాలన్న సీఎం జగన్.. కొవిడ్ పైనా సమీక్ష నిర్వహించారు. అలాగే ప్రికాషన్ డోసు వ్యవధిని తగ్గించినందున వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన వైద్య కళాశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, మెడికల్ కాలేజీల్లో వీలైనంత త్వరగా తరగతులు నిర్వహించేలా తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారాయన. ఆరోగ్యశ్రీ ద్వారా అందించే చికిత్సల జాబితాను పెంచాలి. ఆగష్టు 1వ తేదీ నుంచి పెంచిన చికిత్సలను చేర్చేలా చర్యలు చేపట్టాలి. ఆగస్టు 15వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. దశలవారీగా అమలు చేయాలి. విలేజ్ క్లినిక్స్‌కు, పీహెచ్‌సీలకు డిజిటల్ వీడియో అనుసంధానత ఉండాలి. పెంచనున్న చికిత్సల జాబితాను త్వరలోనే ఖరారుచేస్తామని అధికారులు, సీఎం జగన్‌కు తెలిపారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ ద్వారా 2446 చికిత్సలకు ఉచితంగా వైద్యం అందిస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు వర్చువల్ బ్యాంకు ఖాతాలుఆరోగ్యశ్రీ కింద డబ్బు నేరుగా రోగి వర్చువల్ బ్యాంకు ఖాతాలోకి.. అక్కడ నుంచి ఆస్పత్రికి చెల్లింపు.ఆస్పత్రిలో చేరిన రోగి నుంచి ముందుగా కన్సెంట్ ఫాం, చికిత్స పూర్తైన తర్వాత ధృవీకరణ పత్రం.ధృవీకరణ పత్రంలో వైద్యంకోసం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం నుంచి అందిన సహాయం వివరాలు. అలాగే రోగి కోలుకేంతవరకూ ఆరోగ్య ఆసరా ద్వారా అందుతున్న సహాయం వివరాలు. రోగి నుంచి అదనంగా డబ్బులు వసూలు చేశారా? పూర్తి ఉచితంగా వైద్యం అందిందా? అనే విషయాలను కూడా ధృవీకరించేలా పత్రం. ఎవరైనా లంచం లేదంటే అదనపు రుసుము వసూలు చేసిన నేపథ్యంలో ధృవీకరణ పత్రంలో ఫిర్యాదులకోసం ఏసీబీకి కేటాయించిన టోల్‌ఫ్రీ నెంబర్ 14400 లేదా 104 ఉంచాలని సీఎం జగన్ ఆదేశాలు. రోగి ఆస్పత్రినుంచి డిశ్చార్జి అయిన వారం తర్వాత ఆరోగ్య సిబ్బంది సంబంధిత గ్రామానికి వెళ్లి ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి మీద విచారణ చేయాలని ఆదేశం. మరింత సహాయం అవసరమైన పక్షంలో సమన్వయం చేసుకుని ఆ సహాయం అందేలా చూడాలని సీఎం జగన్ సూచన. రోగికి అంది సేవలు, అదనంగా కావాల్సిన మందులు, తదితర అంశాలపైన కూడా ఫోన్‌కాల్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు.మరింత పటిష్టంగా 108, 104 సేవలు... 108, 104 లాంటి సర్వీసుల్లో కూడా లంచాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా వాహనాలపై కూడా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ ఉంచాలని సీఎం జగన్ ఆదేశం.కోవిడ్‌పైనా సీఎం జగన్ సమీక్ష ఏపీలో కరోనా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని వెల్లడించిన అధికారులు. అక్కడక్కడా కోవిడ్ కేసులు ఉన్నా.. ఆస్పత్రిలో చేరుతున్నవారి సంఖ్య అతిస్వల్పమని తెలిపిన అధికారులు. కేవలం 69 మంది మాత్రమే ఆస్పత్రుల్లో ఉన్నారని, వీరందరూ కూడా కోలుకుంటున్నారని తెలిపిన అధికారులు. ఇప్పటికే 87.15శాతం మందికి ప్రికాషన్ డోసు వేశామని తెలిపిన అధికారులు. ప్రికాషన్ డోసు వ్యవధిని తగ్గించినందున.. వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్న సీఎం జగన్. ముఖ్యంగా 60ఏళ్ల పైబడ్డ వారికి ప్రికాషన్ డోసు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలన్న సీఎం. 15 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్నవారికి రెండోడోసు 99.69శాతం మందికి ఇచ్చామన్న అధికారులు.12 14 ఏళ్ల మధ్యనున్న వారికి 98.93 శాతం రెండో డోసు పూర్తిచేశామని తెలిపారు అధికారులు. సిబ్బంది నియామకంపైనా సమీక్ష ఆస్పత్రుల సామర్థ్యానికి సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది నియామకంపైనా సీఎం జగన్ రివ్యూ చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 40,476 పోస్టులను ఈ ప్రభుత్వ హయాంలో వచ్చాక భర్తీచేశామని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. జులై చివరినాటికల్లా సిబ్బంది నియామకాలు పూర్తిచేయాలని ఆదేశం. ఎక్కడా కూడా లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టీకరణ. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేంతోనే భారీ మార్పులకు శ్రీకారం చుట్టామని, దాంట్లో భాగంగానే ప్రమాణాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించడంతోపాటు, నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని సీఎం జగన్, అధికారుల వద్ద ప్రస్తావించారు. వైద్య ఆరోగ్య శాఖలో నాడు ? నేడుపై సమీక్ష.పనుల్లో ప్రగతిని సీఎం జగన్‌కు వివరించిన అధికారులు. 16 మెడికల్‌కాలేజీల్లోని 14 చోట్ల పనులు ప్రారంభమయ్యాయన్న అధికారులు. మెడికల్ కాలేజీల్లో వీలైనంత త్వరగా తరగతులు నిర్వహించేలా తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలని సీఎం ఆదేశం. ఈ సమీక్షా సమావేశంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖ డైరెక్టర్ జె నివాస్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి జి ఎస్ నవీన్ కుమార్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి వినయ్ చంద్, ఏపీఎంస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్‌రెడ్డి, ఏపీవీవీపి కమిషనర్ వి వినోద్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్(డ్రగ్స్) రవిశంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో భారీ వర్షాలు..

## జల దిగ్బంధంలో లంక గ్రామాలు



అమరావతి జూలై 13 ఏపీలో భారీ వర్షాల కారణంగా పలు జిల్లాలోని గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీగా వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. బ్యారేజీ నీటి మట్టం 15.10 అడుగులకు చేరగా ముందు జాగ్రత్తగా అధికారులు 15 లక్షల క్యూసెక్కులు నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో వరద నీటి ప్రవాహంతో కొన్ని మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలు జలదిగ్బంధంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నాయి. వరద నీరు రహదారులు, కాజ్‌వేలపై పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పి.గన్నవరం మండలం శివాయిలంక, చినకందాల పాలెం, వాడ్రేవుపల్లి, నాగుల్లంక గ్రామాల్లోకి వరదనీరు చేరాయి. అయినవిల్లి లంక కాజ్‌వే పూర్తిగా నీట మునిగిపోవడంతో నాలుగు లంకగ్రామాల ప్రజలు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువ కర్ణాటకలోని పల్నాడు ప్రాంతమైన సీమొగ్గ, ఆరావళి పర్వతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయం ఉప్పొంగుతోంది. వరదప్రవాహం అధికం కావడంతో అధికారులు జలాశయం 20 గేట్లు ఎత్తివేసి 39,243 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేశారు. నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులు కోరుతున్నారు.కాగా పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి కొత్తపేటలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ ఇంటి పైకప్పు కుప్పకూలింది. ఇంటి యజమాని శిరాసాల ఏడుకొండలు ఉదయాన్నే టీ తాగటానికి బయటకు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద 34.3 మీటర్ల నీటిమట్టం నమోదైంది. అప్రమత్తమైన అధికారులు 48 గేట్లను ఎత్తి దిగువకు 12.84 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. పోలీస్ చెక్ పోస్టును వరద నీరు చుట్టుముట్టింది. ప్రాజెక్టు ప్రధాన రహదారిపై వరద నీటిమట్టం 14 అడుగుల చేరడంతో ప్రాజెక్టులోకి రాకపోకలు నిలిపివేశారు.

## రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారు: శైలజానాథ్

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై ఏపీసీసీ అధ్యక్షుడు ( శైలజానాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో వరదలకు సహాయం లేకపోవడం, సకాలంలో జీతాలకు నిధులు రాకపోవడం, రోడ్లు వేయలేకపోవడం, ప్రత్యేక హోదా సాధించుకోక పోవడం సీఎం వైఫల్యానికి నిదర్శనమన్నారు. జగన్ మోహన్ రెడ్డి నోటి నుంచి కనీసం కేంద్రం నుంచి వచ్చే నిధులు సాధించుకోవాలన్న మాట కూడా రావడంలేదని ఆరోపించారు. జగన్‌ను ఎన్నుకున్నది సీఎం హోదాతో ఆయన ఎంజాయ్ చేయడానికో.. సొంత విషయాలు మాట్లాడుకోవడానికి కాదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి అడక్కుండానే ఎగబడి ఎన్డీఏ (ఔఅం) అభ్యర్థికి మద్దతు ఇచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారని మండిపడ్డారు.టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నిసార్లు బీజేపీ (ఃఏఖ) చేతిలో మోసపోతారని శైలజానాథ్ ప్రశ్నించారు. తమ అసమర్థతకు, భయానికి సామాజిక న్యాయం అనే ట్యాగు చంద్రబాబు, జగన్‌లు వేస్తున్నారని, విమానాశ్రయంలో గేటుకు ఒక వైపు వైసీపీ నేతలు, మరో వైపు టీడీపీ నేతలు పోటీపడి మద్దతు, స్వాగతం పలికారన్నారు. బీజేపీకి ఏ రాష్ట్రంలో లేని సంఖ్యాబలం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు.

# యెల్లో మీడియా అబద్ధాల పంట పండిస్తోంది: అసత్య కథనాలపై మంత్రి కాకాణి



అమరావతి: ఎమ్మెల్యేగా ఓడిన పవన్ కల్యాణ్, తప్పుడు ప్రచారాలు చేస్తున్న చంద్రబాబు వ్యాఖ్యలకు ఎల్లో మీడియా ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ప్రజలంతా చూస్తున్నారని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాస్ బుక్ ఉన్న రైతులకు, సీసీఆర్సీ కార్డు ఉన్న రైతు ఆత్మహత్య చేసుకుంటే పరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలు నిరూపించగలరా? నేను సవాల్ చేస్తున్నా. చంద్రబాబుకి క్రెడిబిలిటీ లేదు..పవన్ కళ్యాణ్‌కి క్యారెక్టర్ లేదు. వీళ్ళ మాటల్ని పట్టుకుని ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోంది. అవాస్తవాలు చూపిస్తోంది. అన్నదాతలు అప్పుల సాగు కాదు.. వాస్తవంగా ఎల్లో మీడియా అబద్ధాల సాగు కనిపిస్తోంది ఇప్పుడు అంటూ మండిపడ్డారు మంత్రి కాకాణి. "రైతులకు రూ. 7 లక్షల పరిహారం ఇస్తున్నాం. టీడీపీ హయాంలో రూ. 5 లక్షలని చెప్పి చాలా ఆంక్షలు పెట్టారు. చంద్రబాబు హయాంలో ఆత్మహత్యలు ను కూడా గుర్తించకుండా వాళ్ళకి అన్యాయం చేశాడు. సుమారు 471 మంది రైతులు చంద్రబాబు హయాంలో ఇవ్వకపోతే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిహారం ఇచ్చి అండగా నిలబడింది. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు లేకపోతే లక్ష రూపాయలు బీమా కింద ఇస్తున్నాం. క్రాప్ హాలిడే అన్నదే లేదు.. ఎక్కడా కరువు మండలాల ప్రకటించలేదు. ఈ ఏడాది ఎన్నడూ లేనివిధంగా ముందుగా నీళ్లు ఇస్తున్నాం. చంద్రబాబు లాగా రుణమాఫీ పేరు చెప్పి మోసం చెయ్యలేదు. ప్రతి రైతుకు ఇప్పుడు రైతు భరోసా ఇస్తున్నాం" అని మంత్రి కాకాణి స్పష్టం చేశారు.ప్లీనరీ తరువాత దుష్టచతుష్టయానికి కడుపు మంట పెరిగింది. అందుకే వాళ్ల కోసం చర్చించాం.ఎమ్మెల్యే గా ఓడిపోయిన పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఎల్లో మీడియా ఎంత ప్రాధాన్యం ఇస్తుందో చూస్తున్నాం. చంద్రబాబు కోసం ఎల్లో మీడియా ఎలా వ్యవహరిస్తుందో అసత్యపు కథనాలు, తప్పుడు రాతలే నిదర్శనం అని మంత్రి కాకాణి చెప్పారు.

# ఉధృతంగా గోదావరి



ధవళేశ్వరం: ఎగువ రాష్ట్రల్లో వర్షాలతో గోదావరి ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం దగ్గర ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 15.07 లక్షల క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు. వరద పరిస్థితిని విపత్తుల శాఖ ప్రధానకార్యదర్శి సాయిప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. సహాయక చర్యల్లో 5 ఎన్డీఆర్ఎఫ్, 4 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గురువారం మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. పోలవరానికి ఎగువన ఉన్న ఏజెన్సీ, దిగువన ఉన్న లంక గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఈ ప్రాంతాల్లోని సుమారు 130 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏజెన్సీ గ్రామాలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. గిరిజనులు చీకటిలో మగ్గిపోతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక గ్రామాల్లోకి నీరు చేరడంతో రోడ్లు, వంతెనలు నీట మునిగి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ గ్రామాల్లోని ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. బాధిత ప్రజలను అధికారులు పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. చలిగాలులు బలంగా వీయడంతో జనం వణికిపోయారు. ఈదురు గాలులతో కృష్ణా తీరంలోని వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

# ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఏపీ సర్కార్ గ్రీన్‌సిగ్నల్

అమరావతి జూలై 13 ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఏపీ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం నిర్ణయంతో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న 896 మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. ఈ కారుణ్య నియామకాలను గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్టీసీ, జిల్లా కలెక్టర్ల పరిధిలో చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.సర్వీసులో ఉండి చనిపోయిన ఉద్యోగుల విషయాన్ని ఎన్ఎంయూ, ఈయూ, వైఎస్ఆర్ పీటీడీ అసోసియేషన్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు వీరి విజ్ఞప్తిని మన్నించిన ప్రభుత్వం ఈ మేరకు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న 896 కారుణ్య నియామకాలను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నది. కారుణ్య నియామకాలు జరిపే వారి పేర్ల జాబితాను ఆర్టీసీ ఎండీ సంబంధిత జిల్లా కలెక్టర్లకు పంపి, గ్రామ, వార్డు సెక్రటరీ ఉద్యోగాల్లో ఉన్న వారిని గుర్తించి నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన అభ్యర్థుల జాబితాను ఆర్టీసీ ఎండీకి పంపి వారి అర్హతల ఆధారంగా ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులుగా నియమించనున్నారు. ఇంకా మిగిలి ఉంటే ఆ జాబితాను తిరిగి సంబంధిత కలెక్టర్లకు పంపుతారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. విలీనానికి ముందు 896 మంది ఉద్యోగులు సర్వీసులో ఉండగా ప్రాణాలు కోల్పోయారు. కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏపీఎస్ ఆర్టీసీలోని వివిధ యూనియన్ల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## కార్మికులు తక్షణమే విధులకు హాజరుకావాలి: మంత్రి ఆదిమూలపు సురేష్

గుంటూరు: మున్సిపల్ కార్మికులు సమ్మెను విరమింపచేసుకొని చర్చలలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం ఉదయం నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులు డిమాండ్లను ఒకటి తప్ప అన్ని పరిష్కరించామన్నారు. రూ.18 వేల వేతనం చట్టబద్ధత కాదని తెలిపారు. దానిపై కూడా భవిష్యత్తులో ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్మికులు తక్షణమే విధులకు హాజరుకావాలని మంత్రి ఆదిమూలపు సురేష్ విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం

గురువారం 14-07-2022

### తిరగబడుతున్న జనం...

తలుపు వేసి కొడితే పిల్లి యెలా తిరగబడుతుందో, బాగా యెండిన గడ్డికి నిప్పు రవ్వ తగిలితే యే విధంగా భగ్గుమంటుందో, ఆకలితో మలమల మాడుతున్న పులి యే తరహాలో ఘాంర్డించి లంఘిస్తుందో శ్రీలంక ప్రజలు ఆ విధంగా తిరగబడ్డారు. చేతగాక చేతులెత్తేసిన ప్రభుత్వంపై సింహాలై ఉరికారు. చిచ్చురపిడుగులయ్యా రు. దేశాధ్యక్షుడి భవనంపై వేలాదిగా దండెత్తారు. అధ్యక్షుడు గోటాబయ రాజపక్స తోక ముడిచి సురక్షిత స్థలానికి పరారయ్యేలా చేశారు. శ్రీలంకను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిన రాజపక్స కుటుంబానికి ఉచ్చు బిగుసుకుంది. నాలుగు రోజుల క్రితం అధ్యక్ష భవనం వదిలి పారిపోయిన గొటబయ రాజపక్సే రిజైన్ చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే రాజీనామా లేఖపై ఆయన సంతకం చేసినట్టు చెబుతున్నారు. అయితే ఆయన ఎక్కడున్నారనే విషయం మిస్టరీగా ఉండగా ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకొచ్చింది. అదేమిటంటే దేశం విడిచి పారిపోవాలని రాజపక్స చేసిన ప్రయత్నాలు ఫలించలేదట. ఆయనకు స్టాంపింగ్ చేసేందుకు ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ అధికారులు నో చెప్పారట. దీంతో ఆయన ఎయిర్‌పోర్ట్‌కు దగ్గర్లోని మిలిటరీ బేస్‌లో ఓ రాత్రంతా ఎదురుచూస్తూ ఉండిపోయారని సమాచారం. రాజీనామా చేశాక అరెస్ట్ చేసే చాన్స్ ఉండటంతో విదేశాలకు పారిపోవాలని చూస్తున్నారు రాజపక్స. నిరసనకారులు కొలంబోలోని తన అధికారిక నివాసాన్ని ఆక్రమించుకునేలోపే 73 ఏళ్ల నాయకుడు పారిపోయాడు. ప్రెసిడెంట్‌గా, రాజపక్స అరెస్టు నుంచి బయట పడ్డారు. నిరసనకారుల దాడుల నుంచి తప్పించుకునేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పదవీవిరమణ చేసే ముందు అతను విదేశాలకు వెళ్లాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.గొటబయ రాజపక్స చీఫ్ ఎయిర్ మార్షల్‌కు చెందిన ప్రైవేట్ బిల్డింగ్‌లో తలదాచుకున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఈ కథనాలను శ్రీలంక ఎయిర్ ఫోర్స్ ఖండించింది. ఎయిర్ ఫోర్స్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. గొటబయ రాజపక్స సోదరుడు, మాజీ ఆర్థిక మంత్రి బసిల్ రాజపక్స కూడా దుబాయ్ పారిపోవడానికి ట్రై చేశారు. అయితే ఎయిర్‌పోర్ట్‌లో ఆయనను స్టాఫ్ అడ్డుకున్నారు.బసిల్‌కు అమెరికా పౌరసత్వం ఉంది. దుబాయ్ మీదుగా అమెరికా వెళ్లేందుకు బసిల్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది. మరోవైపు, రాజకపక్స సోదరులు ఎవరూ దేశం విడిచి వెళ్లకుండా నిషేధం విధించాలని కోరుతూ శ్రీలంక సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.గొటబయ రాజపక్స బుధవారం రాజీనామా చేస్తానని ప్రకటించడంతో అధ్యక్ష పగ్గాలు చేపట్టేందుకు ముందుకొచ్చారు సుజిత్ ప్రేమదాస. ఎస్‌జేబీ పార్టీ అధ్యక్షుడైన ప్రేమదాస ఇప్పటి వరకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తానన్న ప్రకటించిన ప్రేమదాస మద్దతు కోసం ఇతర పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. శ్రీలంకలో పదవులు చేపట్టడానికి నాయకులందరూ భయపడుతున్న వేళ ప్రేమదాస ముందుకురావడం విశేషంపెట్రోలు, ఆహారం, మందులు తదితర అత్యవసర సామగ్రి ధరలు ఆకాశాన్నంటి రోజులు గడవడం కష్టతరమైన ప్రజలు దేశమంతటి నుంచి కొలంబో చేరుకొని యీ దాడిలో పాల్గొన్నారు. దుబాయ్ వంటి విదేశాల నుంచీ సింహాళీయులు తరలి వచ్చి యీ ఘట్టంలో పాలు పంచుకొన్నారని వార్తలు చెబుతున్నాయి.విదేశీ అప్పు 50 బిలియన్ డాలర్లు దాటిపోయింది. ఒక్క చైనాకు యివ్వాల్సిందే 6 బిలియన్ డాలర్లు. ప్రజలు తమంతట వీధుల్లోకి వచ్చిన యీ నిరసనల్లో దేశాధ్యక్షుడు గోటాబయ రాజపక్స అవినీతి బాహాటంగా ప్రస్తావనకు వచ్చింది. విదేశీ ఖాతాల్లో దాచుకొన్న కోట్లాది డాలర్ల అవినీతి సొమ్ము తెచ్చి నిత్యావసరాలను అందించండని కోరుతూ నిరసనకారులు ప్ల కార్డులు ప్రదర్శించారు. అధ్యక్షుడు గోటాబయను జీఆర్ గా, ఆయన సోదరుడు మహీందను ఎంఆర్ గా మరో సోదరుడు బాసిల్ రాజపక్సను ఃఖీగా సంబోధిస్తూ ప్ల కార్డులు వెలిశాయి. ముందు చూపు లేని ప్రభుత్వ చర్యల వల్ల డాలర్ నిల్వలు అడుగంటిపోయి దిగుమతులకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి దాపురించింది. ద్రవ్యోల్బణం జూన్ నెలలో 54.6 శాతానికి చేరుకొన్నది. నిరసన శిబిరాలు ఆగ్రహంతో ఊగిపోతున్న సంగతి గమనించిన అధికారులు ముందు రోజు శుక్రవారం నాడే గోటాబయను నివాస భవనం నుంచి సురక్షిత స్థలానికి చేర్చారు తమ బాధలన్నింటికీ అధ్యక్షుడే కారణమన్న అభిప్రాయంతో నిరసనకారులు 'గోటా గో హోమ్' అంటూ విరుచుకుపడ్డారు. ప్రధాని విక్రమ్ సింఘే ప్రైవేటు భవనాన్నీ తగలబెట్టారు. ఈ దెబ్బతో అధ్యక్షుడు, ప్రధాని కూడా రాజీనామా చేస్తామని ప్రకటించారు. అఖిల పక్ష ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తామన్నారు. అరబ్ స్ప్రింగ్ పద్ధతిలో చోటు చేసుకొంటున్న శ్రీలంక ప్రజాగ్రహ ప్రదర్శనలకు భయపడి గత మే 9న ప్రధాని పదవికి అధ్యక్షుని సోదరుడు మహీంద రాజపక్స రాజీనామా చేశారు. దానితో గతంలో అయిదు సార్లు ప్రధానిగా చేసిన విక్రమ సింఘేను కొత్త ప్రధానిగా అధ్యక్షుడు నియమించారు. ఇప్పుడు యిద్దరూ దిగిపోతామని ప్రకటించడంతో మంత్రులంతా రాజీనామా చేశారని వార్తలు చెబుతున్నాయి.పర్యవసానంగా అఖిలపక్ష ప్రభుత్వం యేర్పాటు కోసం సంప్రదింపులు సాగుతున్నాయని తెలుస్తున్నది. ఈ ప్రజోద్యమం వెనుక దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థుల సంఘటిత హస్తమున్నట్టు సమాచారం. వీలైనంత త్వరగా తదుపరి ప్రభుత్వాన్ని యేర్పాటు చేసి సంక్షోభ పరిష్కార కృషిని చేపట్టకపోతే ప్రజాగ్రహం మరింతగా రగిలి అనూహ్య పరిణామలకు దారి తీయవచ్చు. ఈసారి నిరసనకారులపై కిరాయి మూకలను గాని, ప్రభుత్వ దళాలను గాని ప్రయోగించకపోవడం మెరుగైన పరిణామం. మే 9 నాటి ఘటనల్లో ప్రదర్శకులపై అప్పటి ప్రధాని వర్గీయులు బలప్రదర్శన చేయడంతో హింస చెలరేగి వొక ఎంపి సహా అయిదుగురు దుర్మరణం పాలయ్యారు. శ్రీలంక రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవి ఖాళీ అయినప్పుడు ప్రధాని గాని, పార్లయిమెంటు స్పీకర్ గాని దానిని చేపట్టడానికి అర్హులవుతారు. ప్రధాని సయితం దిగిపోతున్నారు కాబట్టి స్పీకర్ మహీంద యాపా అబేయ వర్ధనకే ఆ అవకాశం వుంది. తాత్కాలిక అధ్యక్షుడుగానే ఆయన ఉండగలుగుతారు. ఆ తర్వాత నెల రోజుల్లో పార్లమెంటు కొత్త అధ్యక్షుడిని యెన్నుకొంటుంది. తక్షణమే కొత్త ప్రభుత్వాన్ని యేర్పాటు చేయడంతోపాటు ప్రస్తుత సంక్షోభానికి దారి తీసిన ఆర్థిక దుస్థితిని తొలగించడం అవసరం. శ్రీలంక ఆర్థిక సంక్షోభానికి పలు కారణాలున్నాయి.కొవిడ్ మూలంగా దాని కీలక ఆదాయ వనరు పర్యాటకం తీవ్రంగా దెబ్బతిన్నది. దేశమంతా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్ల ఆహారోత్పత్తి పడిపోయింది.

# ఏపీలో కమల వ్యూహం

విజయవాడ, జూలై 13, దక్షిణాదిలో పాగా వేయాలన్న బీజేపీ ఆకాంక్షలకు ఇక్కడి ప్రాంతీయ పార్టీలు పెద్ద అవరోధంగా నిలిచాయి. దక్షిణాదిలో ఒక్క కర్నాటక తప్ప మరే ఇతర రాష్ట్రంలోనూ బీజేపీ తన ఉనికిని బలంగా చాటుకోవడంలో విఫలం అయ్యింది. ఇప్పుడిప్పుడు తెలంగాణ ఒకింత బలోపేతమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. అయినా అక్కడ అధికారం చేపట్టేందుకు ఆ పార్టీ ఇంకా చాలా దూరమే ప్రయాణించాల్సి ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో అధికార టీఆర్‌ఎస్ తో పాటు కాంగ్రెస్ కూడా బీజేపీకి గట్టి పోటీనిచ్చే పరిస్థితులు ఉన్నాయి. దీనికి తోడు తెలంగాణ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి అడ్డుపడటమే కాకుండా కేంద్రంలోని మోడీపై తీవ్ర స్థాయి విమర్శలతో కాలుదువ్వుతున్నారు. అదే సమయంలో మరో తెలుగురాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో బీజేపీకి ఎలాంటి ఉనికి, పునాదీ లేకపోయినా.. కేంద్రంలో అధికారంలో ఉన్నదన్న ఏకైక కారణంతో.. అవసరాలేమైతేనేం సీఎం జగన్ మాత్రం మోడీ ప్రతి కార్యక్రమానికి, ప్రతి విధానానికీ మద్దతు ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ తో బీజేపీ ఎలాగూ ఢీ అంటే ఢీ అనే విధానాన్నే అనుసరిస్తోంది. అయితే ఏపీలో మాత్రం అధికార వైసీపీ మోడీ సర్కార్ తో బహిరంగంగానే రహస్య మైత్రిని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీలో అధికారం కోసం మోడీ షా ద్వయం ఎటువంటి వ్యూహ రచన చేస్తున్నదన్న విషయంలో పరిశీలకులు పలు విశ్లేషణలు చేస్తున్నారు. ఏపీలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ మోడీ షా ద్వయం నేతృత్వంలోని బీజేపీ చెబుతున్నప్పటికీ ఇక్కడి అధికార పార్టీతో రహస్య మైత్రి కొనసాగించడంలోని ఆంతర్యంపై పరిశీలకుల అంచనాలు పలు విధాలుగా ఉంటున్నాయి. ఏపీ బీజేపీ నేతలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శల అస్త్రాలు సంధిస్తున్నా, వాటికి వైసీపీ నాయకత్వం నుంచి దీటుగా బదులు రావడం లేదు. వైసీపీ సర్కార్ పై యుద్ధమే అంటే ఏపీ బీజేపీ నేతలు అంటుంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ మాత్రం అవసరమైన ప్రతి సందర్భంలోనూ జగన్ సర్కార్ కు అండగా నిలుస్తోంది.ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కున్న ఏపీ సర్కార్ కు నిబంధనల చట్రాలను దాటి మరీ అప్పులకు అనుమతులు ఇస్తోంది. అయితే ఇదంతా మోడీ, షా ద్వయం వ్యూహం మేరకే జరుగుతోందన్నది విశ్లేషకుల బావన. 2019 ఎన్నికలలో ఏపీ నుంచి ఒక్క అసెంబ్లీ సీటు, ఒక్క లోక్ సభ స్థానంలోనూ గెలవలేకపోయిన బీజేపీ, పోటీ చేసిన ఏ స్థానంలోనూ కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయిన బీజేపీ, వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యం అన్న స్థాయిలో బిల్డప్ ఇవ్వడం వెనుక మోడీ, షాల పటిష్ట, పకడ్బందీ వ్యూహమే ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఒక పక్కన హస్తినలో దోస్తీ కలర్ ఇస్తూనే మరో పక్కన గల్లీలో మాటల యుద్ధానికి బీజేపీ నేతలు కాలుదువ్వడం వెనుక మోడీ, షాల వ్యూహమే ఉందని అంటున్నారువాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటే ఏపీలో బీజేపీకి అధికార పీఠం అందడం అనేది దాదాపు అసాధ్యం, అయినా.. బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు ఎందుకు అంతలా వైసీపీపై రెచ్చిపోయి మాట్లాడగలుగుతున్నారనే సీక్రెట్ అందరికీ తెలిసిందే అంటున్నారు. మొన్నామధ్యన కడప జిల్లా బద్వేల్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నకల్లో బీజేపీ అభ్యర్థిని నిలబెట్టింది. ఇటీవలే నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల బరిలో కూడా అభ్యర్థిని నిలబెట్టింది. కేంద్రంలో తనకే మద్దతిస్తున్న జగన్ పార్టీపై రాష్ట్రంలో ఇలా పోటీకి దిగడం వెనుక మోడీ రహస్య ప్రణాళికే ఉందంటున్నారు. అయితే ఆ రెండు ఉప ఎన్నికలలోనూ బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు అది వేరే సంగతి. రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే బరిలో దించిన అభ్యర్థి ద్రౌపది ముర్ముకు వైసీపీ బేషరతుగా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు స్థానిక బీజేపీ నాయకత్వం మాత్రమే వైసీపీపై, జగన్ పై దూకుడుగా ఉన్నా.. రాష్ట్రపతి ఎన్నికల తర్వాత జగన్ కు కేంద్రం నుంచి కూడా వరుస ఝలక్ లు తప్పవని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.వరుసగా రెండు సార్లు జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించుకున్న బీజేపీకి ఈ సారి ఎన్నికల్లో గతంలో కంటే ఎంపీ స్థానాలు తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయని సర్వేలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో.. ఆ లోటును పూడ్చుకునేందుకు బీజేపీ అధినాయకత్వం దక్షిణాదిపై దృష్టి సారించిందంటున్నారు. తమిళనాడులో బీజేపీ ఆటలు ఎలాగూ సాగవు. కేరళలో కూడా ఇంచు మించు అదే వాతావరణం ఉంటుంది. తెలంగాణలో కేసీఆర్ తో విభేదించే వైఖరితో ఎన్నికలకు వెళ్లేందుకే సిద్ధమైంది. తెలంగాణలో ఎన్ని ఎంపీ సీట్లు వస్తాయో కచ్చితమైన అంచనా లేకపోవడంతో ఇక.. మిగిలి దక్షిణాది రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అందుకే ఇక్కడ అటు జనసేనతోనూ.. ఇటు అధికార వైసీపీతోనూ కర్ర విరగాకూడదు.పాము చావా కూడదన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సమయానికి ఏ పార్టీతో కలిసి పోటీ అన్న విషయాన్ని బీజేపీ అధినాయకత్వం నిర్ణయించే వరకూ వైసీపీతో హస్తినలో దోస్తీ, ఏపీలో కుస్తీ అన్న విధానాన్నే అవలంబిస్తుందనీ, అలాగే జనసేనతో కూడా మైత్రికి కటీఫ్ చెప్పకుండా కొనసాగిస్తుందనీ అంటున్నారు. ఎన్నికల సమయంలో బీజేపీకి ఏ పార్టీ అధిక ఎంపీ సీట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తుందో ఆ పార్టీలో కలిసి రంగంలోకి దిగే అవకాశాలున్నాయని అంటున్నారు. కేసుల కారణంగా జగన్ బలహీనతను అడ్డు పెట్టుకుని అత్యధిక స్థానాలు బేరం ఆడే అవకాశం ఉంటుందన్నది బీజేపీ అగ్రనాయకత్వం ఆలోచనగా కనిపిస్తుందంటున్నారు. ఎంపీ సీట్లతో పాటు చెప్పుకోదగ్గ అసెంబ్లీ స్థానాలలో కూడా జగన్ బలహీనతను అడ్డు పెట్టుకుని సాధించుకోవచ్చన్న వ్యూహంతోనే బీజేపీ అగ్రనాయకత్వం, కేంద్రం ఏపీ సర్కార్ కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాయని అంటున్నారు

# సైకిల్ యాత్రకు సిద్ధం

విజయవాడ, జూలై 13, పూర్వం ఎన్టీఆర్‌ను ఎంతో ప్రేమగా తమ వాడిగా చేసుకుని ఎన్టీవోడు అన్నారు యావత్ ఆంధ్రాజనం. 99 ప్రపంచకప్ విజయం తర్వాత ధోనీ పేరుతో ట్యాటూలు వేయించుకున్నారు అమ్మాయిలూ, క్రికెట్ పిచ్చా ళ్లు. అభిమానానికి, వీరాభిమానానికి పెద్ద తేడా లేకపోవచ్చుగాని, దాన్ని తెలియజేయడంలో మాత్రం చాలా తేడా చూపుతారు సదరు వీరాభిమానులు. వీరాభిమానులు రాజకీయనాయకులకూ వుంటారు. ప్రస్తుతం అంతటి వీరాభిమాని అభిమాన వర్షంలో తడిసి ముద్దై పలుకించిపోతున్నది మాత్రం తెలుగుదేశం అధినేత చంద్రబాబు అనే అనాలి. తమ నాయకుడు ఓ చిన్నపాటి మంచి పని చేస్తే కటౌట్‌కి పాలాభిషేకం చేసేస్తున్నారు ఈ రోజుల్లో. అలాం టిది ఆంధ్రాలో మళ్లీ అధికారంలోకి రావడానికి పార్టీని నాలుగింతలు ఉత్సాహపరిచి కదం తొక్కుతున్న చంద్రబాబు పట్ల ఇంకెంతటి వీరాభిమానం వుండాలి. తమ నాయకుడు తప్పకుండా రాష్ట్ర ప్రజానీకానికి గొప్ప మేలు చేస్తాడన్ననమ్మకం కుదరాలేగాని వీరాభిమానానికి అంతుండదు, ఉత్సవాలు చేసుకుంటా రు, స్వీట్లు పంచుకుంటారు, వూరూరా భారీ ప్రచారానికి దిగుతారు. వీటికి దేనికీ నాయకుడినో, పార్టీ వర్గా లనో డబ్బులిమ్మని అడగరు.. వాళ్ల సొంత ఖర్చుతోనే అన్నీ చేస్తారు. దీన్ని పిచ్చనండి, మరేదయినా అనండి.. అసలు పేరు మాత్రం వీరాభిమానం. అదుగో అలాంటి వీరాభిమానం మరో పేరు కృష్ణ. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని కలలు గనడమే కాదు, అది సాకారమయ్యే వరకూ గొప్ప కఠోర దీక్ష చేస్తున్నాడు. వీర తాడు వేసుకున్న కృష్ణ అందుకు ఒక వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నాడు. విజయవాడ కు చెందిన కృష్ణ అనే టీడీపీ కార్యకర్త ప్రజా చైతన్య సైకిల్ యాత్ర చేపట్టారు. విజయవాడ నుండి హిందూపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర చేస్తున్నాడు. ప్రస్తుతం సంగంకి చేరాడు. సైకిల్ కి టీడీపీ జెండాలు కట్టుకుని.. ప్రత్యేకంగా బోర్డు లు ఏర్పాటు చేసుకుని యాత్ర చేస్తున్నాడు. ధర్మపరిపాలన కావాలి టీడీపీ గెలవాలి అనే నినాదం తో యాత్ర చేపడుతున్నట్లు తెలిపాడు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యే వరకు ఈ సైకిల్ యాత్ర కొనసాగిస్తానని పేర్కొన్నాడు. నాయకుడి కంటే వీరాభిమానే గొప్పవాడు, నాయకుని విజయానికి ఇలాంటి వీరాభిమాని కఠోర దీక్ష శక్తినిస్తుంది. ఈ శక్తి అపారమైనది. ఇలాంటి శక్తులు రాష్ట్రంలో ఎల్లవేళలా పార్టీకి కొత్త వూపిరినిచ్చి ముందడుగు వేయిస్తుంది. శభాష్ కృష్ణ! జయహో టీడీపీ! అన్నదే ఇప్పుడు తెలుగుదేశం శ్రేణుల నినాదం అయ్యింది

# మొక్కుబడిగా కొల్లేరు అభయారణ్యాన్ని చెక్‌పోస్టులు

ఏలూరు, జూలై 13, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులో సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు 11వ శతాబ్ద ప్రాంతంలో ఒక పట్టణం. 17వ శతాబ్దం వరకూ ఇక్కడ మనుషులు సంచరించారు. అయితే తెలుగు రాజుల కాలంలో కొల్లేరు పట్టణం దగ్ధమైపోయినట్లు చరిత్ర చెబుతోంది. తదనతంరం పెద్దగొయ్యిగా ఏర్పడి, గోదావరి, కృష్ణా నదుల నుంచి వచ్చే అదనపు నీరు, వరదల నీటితో ఈ ప్రాంతం ముంపునకు గురైంది. సముద్రమట్టానికి 10 అడుగుల ఎత్తు వరకూ సుమారు 314 చ.మైళ్ల విస్తీర్ణంలో నీరు నిలబడి ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఒక సరస్సుగా గుర్తించి, కొల్లేరు సరస్సుగా నామకరణం చేశారు. ఇలా 18వ శతాబ్దం ప్రారంభంలో కొల్లేరు సరస్సుగా ఏర్పడింది. సరస్సులో వివిధ రకాల చేపలు, కలువ కాయలు(కలేబి కాయలు), నాచు కాయలు ఇలా ఎన్నో రకాల మొక్కలు నీటిలోంచి పుట్టుకువచ్చి కాయలు కాస్తుండేవి. ఆ కాయల్ని తినేందుకు విదేశాల నుంచి 200 రకాలకు పైగా పక్షులు వలస వచ్చేవి. వీటితో పాటు స్థానిక పక్షులు లక్షలాదిగా కొల్లేరులో జీవించేవి. అయితే రానురాను పక్షులు ఇక్కడ మనుగడ సాగించే పరిస్థితులు కానరావడం లేదు. కొల్లేరు అభయారణ్య పరిరక్షణకు గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. కొల్లేరుతో పాటు ఐదో కాంటూర్‌ను పరిరక్షించడానికి నిత్యం పహరా కాయాల్సిన యంత్రాంగమే చోద్యం చూస్తోంది. ఫలితంగా ఒకనాడు కొల్లేరులో తిరుగుతున్న తిమింగాల్ని సైతం లెక్కచేయకుండా బాంబులతో పేల్చేసిన చెరువుల స్థానంలో నేడు పుట్టగొడుగుల్లా కొత్త చెరువులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. అడపాదడపా దాడుల పేరుతో ఎంపిక చేసుకున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి, కాసులు దండుకోవడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.ఆటపాకలోని రక్షిత పక్షుల కేంద్రంలో కూడా పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వందలాది విదేశీ పక్షులు మృత్యువాత పడుతున్నాయి. సాక్షాత్తూ అటవీశాఖ అధికారుల కళ్లముందే ఈ దారుణం జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పక్షుల కేంద్రంలో యంత్రాలతో అభివృద్ధి పనులు చేయకూడదనే నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. పక్షులు సంచరించే ప్రాంతాల్లో విచ్చల విడిగా చేపలు, రొయ్యల చెరువులు పుట్టుకొస్తుండటంతో మేత, యాంటి బయోటిక్స్ విని యోగం విచ్చలవిడిగా జరుగుతూ పక్షుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్నాయి. ఏటా వేసవిలో కొల్లేరులోని వందలాది ఎకరాల్లో కిక్కిస దగ్ధమవుతోంది. కిక్కిస మంటల్లో వేలాది పక్షులు, పక్షి గుడ్లు మాడి మసైపోతున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొల్లేరు కుచించుకుపోతోంది. సరస్సు మనుగడకు ప్రమాదం ఏర్పడింది. అంతరించే స్థాయికి పక్షులు చేరుకున్నాయి. కొల్లేరు కిలకిల రావాలు వినాలంటే, సరస్సు మనుగడ కాపాడాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు సరస్సుపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.కొల్లేరు సరస్సులో జలాలు కనుమరుగవుతున్నాయి. కొల్లేరు ప్రాంతం నెరలు తీసి బీడు బారుతోంది. వివిధ రకాల ఫ్యాక్టరీలకు చెందిన రసాయన వ్యర్థాలతో కూడిన నీరు కొల్లేరులో చేరుతోంది. దీంతో పక్షులు చనిపోతున్నాయి. వాటి కళేబరాలు పచ్చిక పొదల్లో పడి కుళ్లి కృశించిపోతున్నాయి. ఇలా మృత్యువాత పడుతున్న వాటిలో ప్రసిద్ధిగాంచిన విదేశీ పెలికాన్ పక్షులూ ఉన్నాయి. కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మొక్కుబడిగా ఉన్నాయి. అభయారణ్య పరిధిలో కృష్ణా జిల్లాలో రెండు, పశ్చిమగోదావరి జిల్లాలో 4 చెక్ పోస్టులున్నాయి. చేపల మేత, మందులు, వాహనాల రాకపోకల నిషేధంతో పాటు, కొల్లేరు పక్షుల్ని రక్షించాల్సిన బాధ్యత చెక్‌పోస్టు అధికారులు, సిబ్బందిపై ఉంది. వీరు సరిగా పట్టించుకోనందున అభయారణ్యంలోకి వెళ్లకూడనివన్నీ వెళ్లిపోతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గిరి ప్రదర్శనకు అంతా సిద్ధం

విశాఖపట్నం ప్రతీ ఏడాదిలో విశాఖ సింహాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేకత ఉంటుంది.నిత్యం భక్తుల చేత పూజలందుకుంటూ కటాక్షించే అప్పన్నస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టు ప్రదక్షిణ చేస్తే భూ మండలం చుట్టూ ప్రదక్షిణ చేసినంత పుణ్యం సిద్దిస్తుందని భక్తుల ప్రగాడ విశ్వాసం.కానీ కరోనా కారణంగా రద్దు అవుతూ వచ్చిన గిరిప్రదక్షిణకు ఈ సారి మాత్రం భక్తులు భారీగా తరలి వచ్చి అప్పన్నస్వామిని దర్శించుకుంటున్నారు.సుమారుగా 32 కిలోమీటర్లు పాటు ఉండే సింహగిరి చుట్టు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు స్వామి నామస్మరణతో ముందుకు సాగుతున్నారు.ఆషాడ పూర్ణిమ రోజున భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అప్పన్నస్వామి భక్తులు ఈ గిరిప్రదక్షిణలో పాల్గొంటారు.దీని కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు.గిరి ప్రదక్షిణం మొదలుపెట్టే భక్తులు సింహాచలం కొండ దగ్గర తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టి తమ పాదయాత్రకు శ్రీకారం చుడతారు.గిరి ప్రదక్షిణ చేసి అనంతరం పున్నమి ఘడియలలో అప్పన్న స్వామివారిని దర్శించుకుంటే తమ కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.చివరిసారిగా 2019లో గిరి ప్రదక్షిణ జరిగింది. గత రెండేళ్ళుగా కరోనా కారణంగా భక్తులకు అనుమతి ఇవ్వలేదు.ఈ సారి కరోనా తీవ్ర తగ్గడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్ల మధ్య కొనసాగుతున్న గిరిప్రదక్షిణకు భక్తులు పోటెత్తడంతో సింహగిరి చుట్టు ఆద్యాత్మిక వాతావరణం నెలకొంది.

# నాని ఫ్రస్టేషన్ ఎందుకో



విజయవాడ, జూలై 13, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై తాజా మాజీ మంత్రి పేర్ని నానీ వ్యాఖ్యలు, వాటికి కౌంటర్‌గా పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు, ట్వీట్ కౌంటర్ ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్నాయి. వైసీపీలోని కొందరు మరీ ముఖ్యంగా పేర్ని నాని వంటి వారు నోటి విరోచనాలతో బాధపడుతున్నారని నాగబాబు ఘాటుగా రిటార్డ్ ఇచ్చారు. పేర్నికి ఇప్పుడు కావలసింది తేలికగా జీర్ణమయ్యే ఆహారం మాత్రమేననీ, బందరులో వైద్యుడు ఉంటే.. ఆయన నోటి విరోచనాలకు మందు ఇవ్వాలని కోరుతున్నాననీ నాగబాబు ఇచ్చిన కౌంటర్ సోషల్ మీడియాలో తెగ ట్రోల్ అవుతోంది. అదే సమయంలో జనసేనానిపై పేర్ని నాటి వ్యాఖ్యలపై కూడా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్లీనరీలో ఇష్టారీతిన మాట్లాడి జగన్ వద్ద మార్కులు కొట్టేయడానికి చేసిన ప్రయత్నం ఫ్లాప్ అయ్యిందని పేర్ని నానిని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. ఎంత తాపత్రేయపడినా నానికి మార్కులు పడలేదనీ, మరో తాజా మాజీ మంత్రి అనీల్ కుమార్ జగన్ వద్ద గుడ్ విల్ సంపాదించేశాడన్న దుగ్ధతోనే, ఫ్రస్ట్రేషన్ తోనే ప్లీనరీ ముగిసిన 24 గంటల తర్వాత మళ్లీ మీడియా ముందుకు వచ్చి మరీ పవన్ కల్యాణ్ మీద ఇష్టారీతిన వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో నవరత్నాలంటూ ఇచ్చిన హామీలు నకిలీవని ఇప్పుడు తేలిపోవడం నిజం కాదా అని ప్రశ్నిస్తున్నారు. మీడియా సమావేశంలో పేర్ని నాని జనం జగన్ ను నమ్మారు, నమ్మారంటూ పదేపదే చెప్పడాన్ని కూడా ప్రశ్నించి ఎద్దేవా చేస్తున్నారు.నిజంగా జగన్ ను జనం నమ్మి ఉంటే ప్రశాంత్ కిశోర్ వ్యూహాల అవసరమేమిటని ప్రశ్నించారు. ఇటీవల బందరులో స్థానిక ఎంపీ బాలశౌరి పర్యటనను అడ్డుకొనేందుక నీ రైట్ హ్యాండ్ స్థానిక కార్పొరేటర్, నీ కుమారుడి జాన్ జిగ్రీ దోస్తేను ఎగదోసి...ఆ తర్వాత జగన్, సజ్జల చేత అక్షింతలు వేయించుకొన్న పేర్ని నాని,తాడేపల్లి ప్యాలెస్ కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వద్ద ఘొల్లు మని ఏడ్చింది నిజంకాదా నిలదీస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బందరులో తన గెలుపు సాధ్యం కాదని ముందే తెలుసుకున్ననాని, ఓటమి బలిపీఠంపై కుమారుడు పేర్ని కిట్టును నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు.

# వామ్మో..అతిసార

రాజమండ్రి, జూలై 13, సామర్లకోట పరిసర ప్రాంతాల్లో అతిసార జాడలు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వాంతులు విరోచనాలతో బాదపడుతున్న కేసులు ఆసుపత్రిలో నమోదు అవుతున్నాయి. తాజాగా అతిసార బారిన పడిన ఇరువురు సామర్లకోట ప్రభుత్వ క్లస్టరు ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, కొద్దిపాటి వర్షాలు, గోదావరి కాల్వకు కొత్తనీరు రావడం, నీటి కలుషితం, ఆహార కాలుష్యం వంటి కారణాల వల్ల అతిసారం ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు నిత్యం పంపింగ్ చేస్తున్న గోదావరి రక్షిత జలాలను మరింతగా శుద్ధిచేసి క్లోరిన్, ఆలం శాతం మరింత పెంచి త్రాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. సామర్లకోట గోదావరి కాల్వ మూసివేత సమయంలో సమీప పరిశ్రమల కలుషిత జలాలు అదిక సంఖ్యలో గోదావరి కాల్వలో కలిసాయి. దాంతో మున్సిపాల్టీ నీటి శుద్ధిపై మరింత దృష్టిపెట్టాల్సి ఉంటుంది. అలాగే చిన్న చిన్న పైపులైన్ల లీకులు అరికట్టాలి. లేదంటే తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ముందస్తు హెచ్చరికలు ప్రకటనలు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలి. నిల్వమాంసం, చేపలు విక్రయాలపై దాడులు చేపట్టి నిరోధించాలి. కాగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో అడపాదడపా డయేరియా కేసులు నమోదవుతున్నాయని, ఈ విషయమై మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చెప్పారు.

# సీమలో తమ్ముళ్ల మౌనం

తిరుపతి, జూలై 13, తెలుగుదేశం పార్టీ రాయలసీమలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. దీనికి తోడు ఇప్పుడు నీటి వివాదం ఆ పార్టీని మరింత ఇబ్బంది పెట్టేవిధంగా మారింది. రాయలసీమలో తెలుగుదేశం పార్టీ గత ఏడేళ్లుగా బలహీనంగా ఉంది. 2014 ఎన్నికల్లోనూ పెద్దగా ఇక్కడ ఫలితాలు దక్కలేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో అయితే రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి దక్కింది కేవలం మూడు సీట్లే. అవి చంద్రబాబు, బాలకృష్ణ, పయ్యావుల కేశవ్ లు మాత్రమే గెలిచారు.రాయలసీమలో తెలుగుదేశం పార్టీకి బలమైన నేతలున్నారు. పేరున్న నేతలే పదుల సంఖ్యలో ఉన్నారు. సుదీర్ఘకాలం నుంచి వారు రాజకీయాల్లో ఉన్నవారే. అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకం, రాజోలి బండ వివాదాలు ఇప్పుడు తెలుగుదేశం పార్టీని ఇరకాటంలోకి నెట్టాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఆ ప్రాంతానికి సాగు, తాగు నీటి సమస్య చాలా వరకు తీరుతుంది. అయితే ఇది పూర్తయితే క్రెడిట్ మొత్తం జగన్ కే దక్కుతుంది.ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఈ వివాదం మరింత ముదురుతుంది. ఇది వైసీపీకి అడ్వాంటేజీగా మారుతుంది. వైసీపీ రాయలసీమ నేతలంతా గొంతెత్తుకుని అరుస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ నేతలు మాత్రం ఈ వివాదం పై నోరు మెదపడం లేదు. తమ ప్రాంతానికి దక్కుతున్న ప్రయోజనాన్ని అడ్డుకుంటున్న తెలంగాణ ప్రభుత్వంపై ఏమీ అనలేకపోతున్నారు. ఈ వివాదంపై ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించడమే కారణం.ఈ వివాదం కేసీఆర్, జగన్ లు సృష్టించినవేనన్నది చంద్రబాబు నమ్మకం. తమను మరింత బలహీన పర్చేందుకు వారిద్దరూ ఆడుతున్న గేమ్ గా చంద్రబాబు అనుమానిస్తున్నారు. అందుకే ఈ వివాదంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని చంద్రబాబు కొంత కటువుగానే నేతలకు చెప్పారట. దీంతో రాయలసీమ తెలుగుదేశం నేతలు ఈ వివాదంపై మౌనంగానే ఉన్నారు. ఇది తమకు భవిష?యత్ లో నష్టం చేకూరుస్తుందని వారు చెబుతున్నారుమైనస్..ప్లస్ పై అంచనాలుతెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు స్ట్రాటజీయే వేరు. ఒకచోట మైనస్ లో ఉన్నా, మరోచోట ప్లస్ లోకి పార్టీని తీసుకెళ్లాలని ఆయన ఎప్పటికప్పుడు తమ వ్యూహాలను అమలు చేస్తుంటారు. రాయలసీమలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉంది. బలమైన నేతలున్నప్పటికీ జగన్ తీసుకుంటున్న చర్యలతో పార్టీకి ఓటు బ్యాంకు క్రమంగా తగ్గుతూ వస్తుంది. కర్నూలుకు న్యాయరాజధానిగా ప్రకటించడంతో పాటు రాయలసీమ ఎత్తిపోతల పథకం విస్తరణ ప్రాజెక్టుతో జగన్ కు మరింత గ్రాఫ్ పెరిగింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో చంద్రబాబు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను తనను ఇబ్బంది పెట్టడానికే ఈ డ్రామా ఆడుతున్నారని ఆయన భావిస్తున్నారు. అందుకే కనీసం రాయలసీమ ఎత్తిపోతల పథకం సీమ నేతలు కూడా నోరు విప్పకుండా కట్టడి చేయగలిగారు. దీంతో సీమలో టీడీపీకి మరింత ఇబ్బందికరంగా మారింది. గత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో రాయలసీమలో జగన్ కు ఆధిక్యత దక్కింది.దీంతో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ ను ఇరకాటంలో నెట్టే ప్రయత్నాన్ని చంద్రబాబు మొదలు పెట్టారు. ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు జగన్ కు లేఖ రాయడం

చంద్రబాబు ఆలోచనే. రాయలసీమ ఎత్తిపోతల పథకం విస్తరణ పనులను నిలిపేయాలని టీడీపీ ఎమ్మెల్యేల చేత డిమాండ్ చేయిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలే ఈ లేఖ రాయడం, జిల్లాకు అన్యాయం జరుగుతుందని చెప్పడంతో ఆ జిల్లాలో పార్టీకి కొంత ప్లస్ అయ్యేలా చంద్రబాబు వ్యూహరచన చేశారంటున్నారు.గత ఎన్నికల్లోనూ ప్రకాశం జిల్లాలో టీడీపీ నాలుగు స్థానాలు దక్కాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండకుంటే ప్రకాశం జిల్లాకు నీళ్లు రావని, ఎడారిగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో టీడీపీకి బలమైన క్యాడర్ , ఓటు బ్యాంకు ఉండటంతో కనీసం దానినైనా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే చంద్రబాబు టీడీపీ ఎమ్మెల్యేల చేత లేఖ రాయించారన్న టాక్ వినపడుతుంది. మొత్తం మీద ఒక చోట మైనస్ అయినా మరోచోట ప్లస్ అయ్యేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# భూమి నుంచి పొగలు..

## బెంబేలెత్తున్న జనాలు

అమలాపురం, జూలై 13 భూమిలో నుంచి సెగలు, పొగలు..మట్టిని పట్టుకుంటే కాలిపోతోంది. ఎస్..కోనసీమ జిల్లా టి.కొత్తపల్లిలో పరిస్థితి ఇది. కోనసీమ జిల్లాలో ఓవైపు భారీ వర్షాలు వరదలతో జనం తీవ్ర అవస్థలు పడుతుంటే.. మరోవైపు భూమి నుంచి పొగలు వస్తూ భయాందోళనకు గురి చేస్తోంది. ఐ. పోలవరం మండలం టి.కొత్తపల్లిలో భయం నెలకొంది. ఓ ఇంటి ఆవరణలో భూమి నుంచి పొగలు, ఆవిర్లు రావడంతో స్థానికులకు గుబులు పట్టుకుంది. భూమి నుంచి పొగలపై టీవీ9 కథనాలకు స్పందించిన తహసీల్దార్..వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా కుండపోత వానలు, వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు పడుతున్నాయి.అలాగే కోనసీమ జిల్లాలోనూ వానలు దంచికొడుతున్నాయి. ఐతే ఐ పోలవరం మండలం టి.కొత్తపల్లి గ్రామంలో..పడిన వర్షం నీరు కూడా వేడెక్కుతోంది. దీంతో షాక్‌కు గురైన స్థానికులు..నీరు వేడెక్కడానికి కారణమేంటా అని కొన్ని అడుగుల మేర బోరు వేసి చూశారు. ఐతే భూమిలో నుంచి పొగలొచ్చాయి. మట్టి నుంచి ఆవిర్లు వస్తున్నాయి. ఆ మట్టిని పట్టుకుంటే చేతులకు బొబ్బలొస్తున్నాయంటున్నారు స్థానికులు.భూమిలో నుంచి ఆవిరి, పొగలతో పాటు..మట్టిని పట్టుకుంటే చేతులు కాలిపోతుండటంతో భయాందోళన చెందుతున్నారు టి. కొత్తపల్లి వాసులు. ఏం జరుగుతుందోనని టెన్షన్ పడుతున్నారు. జోరున వానలు పడుతుంటే..భూమి వేడెక్కడానికి కారణమేంటో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. అసలు భూమి నుంచి పొగలు రావడానికి రీజనేంటో గుర్తించి..అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రూ.3.14 కోట్ల విలువైన మద్యాన్ని పోలీసులు ధ్వంసం

## రోడ్డు రోలర్లతో తొక్కించిన 74,547 మద్యం బాటిళ్ళు



నెల్లూరు జూలై 13 వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న రూ.3.14 కోట్ల విలువైన మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. 74,547 మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్లతో తొక్కించారు. గత మూడేండ్లుగా దాడులు నిర్వహించిన స్వాధీనం చేసుకున్న ఈ బాటిళ్లను పగులగొట్టించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో గత మూడేండ్ల నుంచి అక్రమ మద్యం రవాణాపై 2,774 కేసులు నమోదయ్యాయని ఎస్పీ సీహెచ్ విజయారావు తెలిపారు.ఎస్పీ విజయారావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలో అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు అధికారులు గట్టిచర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఎస్ఈబీ ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం 74,547 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అక్రమ రవాణాదారులపై 2,774 కేసులు నమోదు చేశారు. పొదలకూరు రోడ్డులోని టాస్క్‌ఫోర్స్ ఆఫీస్ గ్రౌండ్‌లో భారీగా మద్యం నిల్వలను అధికారులు రోడ్డు రోలర్‌తో తొక్కించారు. స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్లీత్‌లు దాడులు నిర్వహించి, ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లా నుంచి అంతర్రాష్ట్ర సరిహద్దుల ద్వారా రాష్ట్రంలోకి ఎన్‌డిపిఎల్‌ను అక్రమంగా రవాణా చేయడంపై గట్టి నిఘాను అమలు చేస్తున్నారు.మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా, వాహనాల తనిఖీలును మెరుగుపరిచినట్లు ఎస్పీ విజయారావు చెప్పారు. జిల్లాలో 'పరివర్తన్'లో భాగంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పదేపదే నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ పీ శ్రీలక్ష్మి, నెల్లూరు ఇంఛార్జి ఏసీ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో ఈ మద్యం ధ్వంసం కార్యక్రమం చేపట్టారు.

# గోదావరికి రికార్డు స్థాయి వరద



రాజమండ్రి, జూలై 13, తెలంగాణలో భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.. పలు జిల్లాల్లో కుంభవృష్టి కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి ఊళ్లను దిగ్బంధించాయి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాపల్లిలో.. భూపాలపల్లి, మహాముత్తారం, మహదేవ్‌పూర్, కాటారం మండలాల్లో 15 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రస్తుతం 800 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో ఇళ్లు కూడా కూలిపోయాయి.. ఇక, పంట నష్టం అంచనా వేయాల్సి ఉంది.. చాలా ప్రాంతాల్లో రోడ్లపై నుంచి వాగులు పొంగిపొర్లుతున్నాయి.. దీంతో, కొన్ని రోడ్లు కొట్టుకుపోగా.. మరికొన్ని రోడ్లను దాటలేని పరిస్థితి ఉంది.. దీంతో, చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏ జిల్లాలో పరిస్థితి చూసినా అలాగే ఉంది.. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రాంతాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి..ఓవైపు ఆరు రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్న వర్షాలు.. మరోవైపు, ఎగువన కురుస్తోన్న వర్షాలతో మహారాష్ట్ర నుంచి గోదావరికి వరద పోటెత్తింది.. దీంతో.. ఎన్నడూ లేని విధంగా గోదావరి ఉగ్రరూపం దాల్చింది.. గతంలో ఎప్పుడు లేనంతగా జూలై నెలలోనే గోదారమ్మ పరవళ్లు తొక్కుతోంది.. సాధారణంగా గోదావరికి జూలైలో వరదలు వచ్చినా? లక్ష క్యూసెక్కుల లోపే ఉండేవని గణాంకాలు చెబుతుండగా.. ఆ రికార్డును ప్రస్తుతం వరదలు బ్రేక్ చేశాయి.. 12 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం కొనసాగుతోంది.. ఇది క్రమంగా పెరిగిపోతోంది.. ఓవైపు, రాష్ట్రంలో కురుస్తున్న కుంభవృష్టికి మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ నుంచి భారీగా వస్తున్న వరద తోడు కావడంతో.. గోదావరి ఉగ్రరూపం దాల్చింది.. భద్రాచలం దగ్గర మూడో ప్రమాద హెచ్చరిక వరకు వెళ్లినా.. వరద ఉధృతి మళ్లీ తగ్గడంతో మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు.. అయితే, ఇవాళ ఉదయం నుంచి మళ్లీ భద్రాచలం దగ్గర గోదావరి నీటిమట్టం పెరుగుతోంది.. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా.. ఎప్పుడైనా మూడో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు అధికారులు. ఇక, వందేళ్ల చరిత్రలో ఎప్పుడు లేనట్లుగా జూలై నెలలోనే పోలవరం దగ్గర గోదావరికి రికార్డ్ స్థాయి వరద వచ్చిందని అధికారులు చెబుతున్నారు. పోలవరం దగ్గర గోదావరి పరవళ్లు తొక్కుతుండడంతో.. ప్రాజెక్ట్ 48 గేట్లు ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.. భద్రాచలం నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నుంచి భారీగా ప్రవాహం ఉండడంతో.. క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతోంది.. గోదావరి వరద ఉధృతి కారణంగా ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 15.01 లక్షల క్యూసెక్కులుగా ఉంది.. అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది ఏపీ విపత్తుల సంస్థ .. మొత్తంగా.. తెలంగాణతో పాటు.. ఆంధ్రలోనూ వందేళ్ల తర్వాత రికార్డు స్థాయిలో గోదావరిలో వరద కొనసాగుతోంది.

# మరోసారి జల జగడం

హైదరాబాద్, జూలై 13, ఏపీ , తెలంగాణ మధ్య మరోసారి జల జగడం రాజుకుంటోంది. ఏపీ ప్రభుత్వంపై కంప్లైంట్స్ మీద కంప్లైంట్స్ చేస్తోంది తెలంగాణ సర్కార్. వారం రోజులు తిరగకముందే కేఆర్ఎంబీకి రెండోసారి కంప్లైంట్ చేసింది తెలంగాణ. ఎప్పటిలాగే కృష్ణా జలాలపైనే కంప్లైంట్ చేసింది తెలంగాణ. సరిగ్గా వారంరోజుల క్రితం కేఆర్ఎంబీకి రెండు లేఖలు రాసిన తెలంగాణ సర్కార్, ప్రకాశం బ్యారేజీ దిగువన నిర్మించతలపెట్టిన రెండు ఆనకట్టలపైన, పంప్డ్ స్టోరేజీ స్కీమ్స్‌పైనా ఫిర్యాదు చేసింది. లేటెస్ట్‌గా ఆర్డీఎస్ రైట్ కెనాల్ వర్క్స్‌పై అభ్యంతరం తెలిపింది తెలంగాణ. ఆర్డీఎస్ కుడి కాలువ పనులు కొనసాగించకుండా ఏపీని అడ్డుకోవాలంటూ కేఆర్ఎంబీకి లేఖ రాసింది. ఎలాంటి అనుమతులు లేకుండా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ రైట్ కెనాల్ పనులను ఆంధ్రప్రదేశ్ చేస్తోందని ఆరోపిస్తోంది తెలంగాణ. కేఆర్ఎంబీ ఆదేశాలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని కృష్ణానది యాజమాన్య బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. ఆర్డీఎస్ రైట్ కెనాల్ వర్క్స్‌పై గతంలోనే కంప్లైంట్ చేయడంతో కొంతకాలం పనులు నిలిపివేసిన ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా స్ట్రక్చర్ నిర్మాణం కంప్లీట్‌చేసి గేట్లు అమర్చేందుకు కసరత్తు చేస్తోందని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లింది తెలంగాణ. కేఆర్ఎంబీ, అచిఅ, కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల అనుమతుల్లేకుండా ఆర్డీఎస్ కుడి కాల్వ పనులను ఏపీ పూర్తి చేసిందని లేఖలో పేర్కొంది. ఏపీ చేపట్టిన ఈ ఆర్డీఎస్‌తో తెలంగాణలోని గద్వాల జిల్లా ఆయకట్టుకు సాగునీటి కష్టాలు ఎదురవుతాయని అంటోంది. ఆర్డీఎస్ రైట్ కెనాల్ ద్వారా నాలుగు టీఎంసీల నీటిని అక్రమంగా ఏపీ తరలించుకుపోనుందని తెలంగాణ వాదిస్తోంది. మరి, తెలంగాణ సర్కార్ వరుసగా సంధిస్తోన్న లేఖలపై ఐఖీఓః ఎలా రియాక్టవుతుందో? ఆంధ్రప్రదేశ్ ఏమంటుందో చూడాలి.

# చాతుర్మాస్య దీక్ష ప్రారంభించిన స్వరూపానందేంద్ర సరస్వతి



రుషికేశ్ జూలై 13 విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ బుధవారం ఉదయం పవిత్ర చాతుర్మాస్య దీక్ష ప్రారంభించారు. రుషికేష్‌లో ఉన్న శ్రీశారదాపీఠంలో గురుపూర్ణిమ సందర్భంగా వీరిరువురూ ఈ దీక్ష తీసుకున్నారు. గురు పూర్ణిమ పర్వదినం రోజున వ్యాస పూజతో ఈ చాతుర్మాస్య దీక్షకు అంకురార్పణ జరిగింది. ఆది శంకరుని శంకరభాష్యాన్ని, ప్రస్థానత్రయ భాష్యాన్ని పఠిస్తూ పరమ పవిత్రంగా దీక్షను కొనసాగిస్తారు. సెప్టెంబరు 20న చాతుర్మాస్య దీక్ష ముగిసేంత వరకు స్వామిజీలు రుషికేశ్‌లోనే ఉంటారు. స్వామిజీకిది 26వ దీక్ష కాగా, స్వాత్మానందేంద్ర సరస్వతికిది నాలుగోది.కాగా ఉదయం పుర్ణాహుతి అనంతరం వ్యాస పూజ నిర్వహించారు. ఈ పూజలో శ్రీకృష్ణుడు, వ్యాసుడు, దక్షిణామూర్తి సహా 45 మంది గురువులను ఆరాధిస్తూ అర్చన చేపట్టారు. దీక్షా సమయంలో సాధువులు, సన్యాసులకు అన్నదానం నిర్వహించి దక్షిణలు సమర్పిస్తారు. దీక్షా కాలంలో పీఠానికి పరంపరానుగతంగా వచ్చిన గురువులను స్వామిజీలు నిరంతంర స్మరించుకుంటారు. గంగమ్మతల్లికి నిత్య పూజలు చేసిన తర్వాత శ్రీశారదా పీఠం అధిష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, చంద్రమౌళీశ్వరులకు నిత్య పీఠార్చన చేస్తారు. మొదటి నెలలో కూరలు, రెండో నెలలో పెరుగు, మూడో నెలలో పాలు, నాలుగో నెలలో పప్పు ధినుసులను తీసుకోకుండా దీక్ష కొనసాగిస్తారు.దీక్ష కాలంలో నిత్యం పీఠాధిపతులు తమ స్వహస్తాలతో గంగానదికి హారతులిస్తారు. వేద విద్యార్థులకు స్వామిజీ ధార్మిక అంశాలను బోధిస్తారు. దీక్షా కాలంలో వినయక చవితి, కృష్ణాష్టమి వేడుకలను ఆశ్రమంలోనే జరుపుతారు. చాతుర్మాస దీక్ష పూర్తయ్యేంత వరకు స్వామిజీలు ఎలాంటి పర్యటనలు చేయరు. స్వామిజీని కలిసి ఆశీస్సులు తీసుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి ప్రముఖులు రుషికేష్‌కు వెళ్తుంటారు.కాకినాడలో విజయేంద్ర సరస్వతి దీక్షకాగా మూలామ్నాయ కంచి కామకోటి పీఠం 70వ పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి బుధవారం కాకినాడలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 39వ చాతుర్మాస్య దీక్షను ప్రారంభించారు. ఉదయం వేళ వ్యాస పూజ నిర్వహించిన అనంతరం దీక్షకు అంకురార్పణ జరిగింది. సెప్టెంబరు 10 వరకు ఈ దీక్ష కొనసాగనున్నది. జగద్గురువు శంకరాచార్య పరమార్థం మేరకు దీక్ష చేపట్టడుతున్నారు. చాతుర్మాస్య దీక్ష సందర్భంగా యోగ లింగ చంద్రమౌళీశ్వర సమేత మహా త్రిపురసుందరికి నిత్యం మూడుసార్లు నిత్య పూజలు నిర్వహిస్తారు. చత్రుమాస్య వ్రత దీక్షలో స్వామివారు అత్యంత భక్తిశ్రద్ధలతో జప, తప, ధ్యానాలు చేయనున్నారు.

# సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణం సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి సోమన్న వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఏ సుబ్బరాయుడు సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈ చెన్నయ్య పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ భారత స్వతంత్ర సంగ్రామం జరుగుతున్న రోజుల్లోనే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదట తీర్మానాన్ని ప్రతిపాదించింది. విదేశీ బ్రిటిష్ పాలకులను తరిమికొట్టడం లో సిపిఐ ప్రధాన పాత్ర పోషించారు. అశేష త్యాగాలు చేసింది స్వాతంత్రం తో పాటు దోపిడీ లేని సోషలిస్టు సమాజమే ధ్యేయంగా 97 సంవత్సరాలుగా సామాజిక విప్లవం కోసం వీరోచిత ఉద్యమాలు చేసిన ఘన చరిత్ర సిపిఐ కి ఉందని అన్నారు. నైజాం నవాబుకు జమిందారీ జాగీర్దారీ ఫ్యూడల్ భూస్వామ్య పెత్తందారి తనానికి వ్యతిరేకంగా రాజభరణాలు రద్దు కోసం భూమికోసం భుక్తి కోసం బ్యాంకు జాతీయకరణ కోసం దేశ ప్రగతి దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రజాస్వామ్యం లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించిన సిపిఐ పార్టీ అని అన్నారు. నంద్యాలలో ప్రధమ జిల్లా మహాసభలు ఈనెల 30 31 వ తారీకున జరుగుతున్నాయి. కనుక విజయవంతం చేయవలసినదిగా ప్రజానీకానికి కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పుల్లయ్య రంగారెడ్డి రాజేంద్ర రామయ్య రాజు శివ తదితరులు పాల్గొన్నారు.

# వేల సంవత్సరాల కిందటే ఆర్ష గ్రంథాల్లో ఐన్ స్టీన్ సాపేక్ష సిద్ధాంతం

## ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎవి ధర్మారెడ్డి

తిరుపతి జూలై 13 ప్రముఖ శాస్త్రవేత్త ఐన్ స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం వేల సంవత్సరాల కిందటే ఆర్ష గ్రంథాలు, పురాణాల్లో అనేక చోట్ల కనిపిస్తుందని టీటీడీ ఈవో, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎవి ధర్మారెడ్డి వెల్లడించారు. ఉత్తరాయణం, దక్షిణాయనం లాంటి లెక్కలు ఈ కోవలోకే వస్తాయని ఆయన పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన నవగ్రహ మఖ శ్రీ సుదర్శన పారమాత్మక యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.వేద విద్య అభ్యసిస్తున్న వారు ఆంగ్లం, హిందీ భాషల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. వీటిని నేర్చుకోగలిగితేనే వేద విద్య ను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసే రాయబారులుగా రాణించవచ్చని తెలిపారు. వైద్య విద్య కంటే వేద విద్యాభ్యాసం చాలా కష్టమన్నారు. వేద విద్య ఒక మతానికి సంబంధించినది కాదన్నారు.నవగ్రహాల గురించి కూడా వేల సంవత్సరాల కిందటే ఆర్ష గ్రంథాలు, పురాణాలలో చెప్పడం జరిగిందన్నారు.వేద విశ్వవిద్యాలయానికి త్వరలోనే కొత్త వీసీ నియామకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్య అతిథిగా పుదుచ్చేరి విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ఆంజనేయ శర్మ హాజరు కాగా, జెఈవో సదా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్ధవ్ థాక్రేకు ఊహించని షాక్.. 'మహా' పాలిటిక్స్‌లో మరో ట్విస్ట్

మహారాష్ట్రలో పొలిటికల్ వాతావరణం ఇంకా చల్లబడలేదు. బీజేపీ మద్దతుగా శివసేన రెబల్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ మాజీ సీఎం ఉద్ధవ్ థాక్రేకు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. తాజాగా.. ఉద్ధవ్ థాక్రేకు మరోసారి ఊహించని దెబ్బ తగిలింది. ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మద్దతు తెలపడం మహా వికాస్ అఘడి (ఎంవీఏ)లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్ధవ్ థాక్రే నిర్ణయంపై కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత బాలాసాహెబ్ థోరట్.. శివసేనపై సంచలన విమర్శలు చేశారు. కాగా, బాలాసాహెబ్ ట్విట్టర్ వేదికగా.. శివసేన ఎందుకు ద్రౌపది ముర్ముకు మద్దతు ఇస్తుందో తెలపాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇచ్చే ముందు ఎందుకు ఎంవీఏ కూటమితో చర్చించలేదని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని బేఖాతరు చేస్తూ అప్రజాస్వామిక పద్ధతిలో మహారాష్ట్రలో ఎంవీఏ సర్కార్‌ను కూల్చి, శివసేన ఉనికినే సవాల్ చేసిన బీజేపీ కూటమికి రాష్ట్రపతి ఎన్నికల్లో శివసేన ఎలా మద్దతు ఇస్తుందని ప్రశ్నించారు.మరో అడుగు ముందుకేసి.. రాష్ట్రపతి ఎన్నిక భిన్న సిద్ధాంతాల మధ్య పోరుగా మారిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాటం కోసం సాగుతోందని అన్నారు. అంతా వారి ఇష్టమేనా(శివసేన) అని పరోక్షంగా కామెంట్స్ చేశారు. ఇదిలా ఉండగా.. శివసేన వైఖరిపై అటు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. ద్రౌపది ముర్ముకు మద్దతిచ్చే విషయంలో ఎంవీఏకు శివసేన ముందస్తు సమాచారం ఇవ్వలేదని వెల్లడించింది. కాగా, మహారాష్ట్రలో శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీ భాగస్వామ్యంతో(ఎంవీఏ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

# కుందూ విస్తరణ వలన రైతాంగానికి నష్టం

## జిల్లా రెవెన్యూ అధికారిని కలసిన రైతులు

నంద్యాల కుందూ నది విస్తరణ వలన రైతాంగానికి జరిగే నష్టం పై జిల్లా రెవెన్యూ అధికారికి బుధవారం నాడు కలిసి వినతిపత్రం ఇచ్చిన తొగర్చేడు గ్రామ రైతులు. కుందూనది విస్తరణలో భూ సేకరణ వివరాలు, భూసేకరణ నష్టపరిహారం, భూసేకరణలో బాగంగా తొలగిస్తున్న విద్యుత్ మోటర్ల, పైపుల నష్టపరిహారం కు సంబంధించిన విషయాల గురించి రైతులకు సమాచారం అందించాలని కోరారు , రైతులు మరియు ప్రభుత్వం నష్టపరిహారంపైన పరస్పరం అంగీకారానికి వచ్చిన తరువాతనే కుందూ నది వెడెల్పు కార్యక్రమం చేపట్టాలని తొగర్చేడు గ్రామ రైతులు కోరుతున్నారు .కుందూ నది మీదే సాగునీటికై ఆదారపడిన కుందూ పరివాహక గ్రామాలకు సాగునీటి లభ్యత కొరకు బ్యారేజిల నిర్మాణాన్ని చేపట్టాలని, కుందూ ఆయకట్టు లో ఉండే రైతుల భూములకు నీటి పంపిణీ చేసుకోవడానికి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకోవడానికి తగిన వసతులు కల్పించాలని, గ్రామ ప్రజల అవసరార్థం దోభీఘాట్ ల నిర్మాణం, నదిలోనికి పశువులు, మనుషులు దిగడానికి వీలుగా నిర్మాణాలపై స్పష్టమైన ప్రభుత్వ పాలనా పరమైన అనుమతులను పొంది ఒక క్రమపద్ధతిలో నది వెడెల్పుతో పాటు పై కార్యక్రమాలు కూడా ఏక కాలంలో చేపట్టాలని కూడా కోరతూ వినతిపత్రం ఇవ్వడమైనది.

# పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం లో మన ఆంధ్రప్రదేశ్ భారత దేశంలో నే మొదటి స్థానంలో ఉండాలి



-:రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ ప్రతాపరెడ్డి

కర్నూలు జూలై,13 :- పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం లో మన ఆంధ్రప్రదేశ్ భారత దేశంలో నే మొదటి స్థానంలో ఉండేలా చూడాలని. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాపరెడ్డి,జిల్లాలో ని సంబంధిత అధికారులకు సూచించారుబుధవారం కర్నూలు పట్టణంలోని శ్రీరామనగర్ . గణేష్ నగర్, నిర్మల్ నగర్ లలోని అంగన్వాడీ కేంద్రాలను, దేవనగర్,జొహరపురంలలోని రేషన్ దుకాణాలను. జొహరాపురం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్,జోహర పురంలోని అప్పర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాలను. బెంగళూరు రోడ్డులోని హైదరాబాద్ చెస్ హోటల్ ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప రెడ్డి, సభ్యులు జి.కృష్ణమ్మ, కర్నూలు డియస్ఓ,లతో కలిసి ఆకస్మిక తనిఖీలు గావించారు.కమిటీ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మన ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం లో దేశంలో మూడో స్థానంలో ఉన్నది పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం లో మన ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా చూడాలన్నారు. కర్నూలు పట్టణంలోని శ్రీరామనగర్ నందు గల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పోషక ఆహారాలు సరిగా పంపిణీ గావించడంలేదని వాట్సాప్ ద్వారా ఫిర్యాదు అందిందన్నారు. అందుకుగాను బుధవారం రోజు శ్రీరామనగర్ నందు గల అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేయగా స్టాక్ రిజిస్టర్ లకు అక్కడ ఉన్న స్టాక్ కు పొంతన లేదని రిజిస్టర్ లో ఉన్నవాటి కంటే స్టాక్ ఎక్కువగా వునదన్నారు. అందుకొరకు గాను అంగన్వాడీ వర్కర్ విజయ కుమారి, అంగన్వాడి సూపర్వైజర్ వసంత లపై చర్య తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీ ని ఆదేశించారు. గణేష్ నగర్ లోని అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించడం జరిగిందని కేంద్రం లో పిల్లలు,గర్భిణీ స్త్రీలు, హాజరై ఉన్నారని గర్భిణీ స్త్రీలకు పసుపు కుంకుమ లిచ్చి ఆశీర్వదించడం కూడా జరిగిందన్నారు. అంగన్వాడి కేంద్రము ఆహ్లాద కరంగా ఉందని అన్నారు. కల్లూరు మండలం కర్నూలు అర్బన్ లోని నిర్మల్ నగర్ అంగన్వాడి కేంద్రాన్ని కూడా పరిశీలించడం జరిగింది అని ఈ కేంద్రంలో పిల్లలు. పిల్లల తల్లులు. గర్భిణీ స్త్రీలు హాజరై ఉన్నారని, అక్కడ పిల్లల తల్లులతో సమీక్షించి ప్రభుత్వము ఇస్తున్న టువంటి ప్రధానమంత్రి మాతృ యోజన పథకం గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పథకాలను గురించి వివరించామని అనంతరం హాజరైన చిన్న పిల్లలకు అన్నప్రాసన కూడా నిర్వహించడం జరిగిందన్నారు. అంగన్వాడి కేంద్రాన్ని మంచి వాతావరణంలో నిర్వహిస్తున్నారని ఇదేవిధంగా అన్ని అంగన్ వాడి కేంద్రాలు నిర్వహించాలని పిడికి సూచించారు.కర్నూలు లోని దేవనగర్, జొహరాపురం లోని రేషన్ దుకాణాలు తనిఖీఎండియు వాహనం ద్వారా రేషన్ ను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా ? మీకు రేషన్ సక్రమంగా అందిస్తున్నారా ? తీసుకున్న రేషన్ ను ప్రజలకు ఖచ్చితమైన వెయిట్ తో ఇస్తున్నారా? తదితర విషయాలను డీలర్ ను అడిగి తెలుసుకున్నారు.రేషన్ స్టాకును ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గరుండి తీసుకుంటున్నారా? లేక స్టాక్ మీ దుకాణం వద్దకే వస్తుందా. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పంపిణీ గావించే విషయలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని రేషన్ సక్రమంగా పంపిణీ గావించాలని రేషన్ దుకాణాలను నిర్ణీత సమయంలో తెరిచి ఉ ంచాలని ఎండియు వాహనాలు వచ్చినవెంటనే వారికి పంపిణీ నిమిత్తం రేషన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తయారుచేసిన ఫోర్ట్ ఫైడ్ రైస్ ను పంపిణీ బియ్యంలో కలిపి ప్రజలకు అందిస్తున్నారా? ఈ రైస్ పై కూడా మీరు ప్రజలకు అవగాహన కల్పించాలని డీలర్ కు సూచించామన్నారుజొహరాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఇంగ్లీష్ మునిసిపల్ కార్పొరేట్ హైస్కూల్ ను, మున్సిపల్ అప్పర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాలను, మున్సిపల్ తెలుగు మీడియం పాఠశాలను ఆకస్మిక తనిఖీ లు చేయడం జరిగిందని పాఠశాలల్లో మిడ్ డే మీల్స్ కార్యక్రమంలో భాగంగా తయారవుతున్న వంటలను వంటగదిలోని సామాన్లను, పరిశీలించడం జరిగిందని, వంటలు చేసే వారు పాఠశాలలో విద్యార్థులను చూసి వారికి తగిన మాత్రమే నాణ్యతతో కూడిన భోజనాలు తయారు చేయాలని ఎక్కువ వంటలు చేసి ఫుడ్డు ను వేస్ట్ చేయవద్దని సూచించడం జరిగిందన్నారు.అక్కడ ఉన్న కోడిగుడ్లను స్వయాన తీసుకొని వాటిని పరిశీలించడం జరిగింది అన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అందించే భోజనం కూడా నాణ్యతతో కూడినదై ఉండాలని మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు పోషకాలు కలిగిన ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి ఈ పథకాలను అమలు చేస్తుందని క్షేత్ర స్థాయిలో మీరు కూడా నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. బెంగళూరు రోడ్డు లోని హైవే లో గల హైదరాబాద్ చెఫ్ హోటల్ ను తనిఖీ చేయడం జరిగిందన్నారు. హోటల్ లో ఉన్నటువంటి వంట పదార్థాలను బిర్యానికి సిద్ధంగా ఉంచిన మాంసమును ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది అన్నారు హోటల్ యందు ఆహారాన్ని తయారు చేస్తున్న వంట గదులను పరిసరాలను పరిశీలించడం జరిగింది అని పరిసరాలు పరిశుభ్రంగా నే ఉంచారని అన్నారు. హోటల్ నందు నిన్న తయారు చేసిన ఆహారాలను ఈరోజు విక్రయించే రాదని అలా విక్రయించడం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటాయని వంటలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నాణ్యతతో కూడిన ఆహారాలను తయారుచేసి విక్రయించాలి అన్నారు.రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.కృష్ణమ్మ మాట్లాడుతూ మన ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లలో చిన్న పిల్లల కొరకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని వాటిని సక్రమంగా పిల్లలకు అందేలా చూడాల్సిన బాధ్యత ఐసిడిఎస్ వారిపై ఉన్నదని నిరుపేదలకు అందించేటువంటి రేషన్ బియ్యం నిరుపేదలకు సక్రమంగా అందేలా పౌరసరఫరాల అధికారులు చర్యలు గైకొనాలి అని పాఠశాలలో ప్రవేశపెట్టిన మిడ్ డే మీల్స్ కార్యక్రమంలో మెనూ ప్రకారం నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారుఈ కార్యక్రమంలో , జిల్లా పౌర సరఫరాల అధికారి రాజారఘువీర్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ డి డి సురేష్, సివిల్ సప్లై డిఎం షర్మిల, మిడ్ డే మీల్స్ అసిస్టెంట్ డైరెక్టర్, ఐసిడిఎస్ పీడీ, డీఈవో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, డిడి సోషల్ వెల్ఫేర్ ప్రతాపరెడ్డి, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాముడు తదితర అధికారులు పాల్గొన్నారు

# "గురు పూర్ణిమ వేడుకలు""

శ్రీ అశ్వర్థ నారాయణ సాయి మందిరము"

కర్నూలు జూలై 13 -: బుధవారం రోజు గురు పూర్ణిమ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ పరిధిలోని, కల్లూరు అర్బన్:32 వ వార్డులోని శ్రీ అశ్వర్థ నారాయణ సాయి మందిరములో ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు...పాణ్యం ఎమ్మెల్యే మరియు టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి కుమార్తె కుమారి



కాటసాని మాధవి లత రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై,పూజలు నిర్వహించారు.అనంతరం "అనాధల వృద్ధాశ్రమం" కొరకు నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి కుమారి కాటసాని మాధవిలతా రెడ్డి చేతుల మీదుగా శంఖుస్థాపన చేశారు...ఈ కార్యక్రమంలో 32 వ వార్డ్ కార్పొరేటర్ సాన శ్రీనివాసులు,35 వ వార్డ్ కార్పొరేటర్ కుమారి సాపురు మాధురి,వైఎస్సార్ సీపీ నాయకులు సాపురు వీరయ్య,గోపీనాథ్, సాయి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్సిసెల్ శివ సందేపోగు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన జగన్, బాబు



-: కర్నూలు డీసీసీ అధ్యక్షులు యం సుధాకర్ బాబు

కర్నూలు జూలై 13 -: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నడివీధుల్లో తాకట్టుపెట్టాడానికి జగన్మోహన్ రెడ్డి , చంద్రబాబు నాయుడు సిద్ధమయ్యారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు యం సుధాకర్ బాబు విమర్శించారు. బుధవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో యం సుధాకర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు నరేంద్ర మోడీ బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా , విభజన చట్టంలో పొందుపరిచిన హామీలన్నీ అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన వెంటనే మాట మార్చి తెలుగు ప్రజలను మోసం చేశాడని అలాగే ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డి , వైసీపీ అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు అధికారం చేపట్టాక తమ కేసులు తిరగతోడుతాడనే భయంతో మోడీ ముందు తల దించుకుని నిస్సహాయ స్థితిలో నిలబడాల్సి వస్తుందని ఇలాంటి వారిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, అలాగే ప్రతిపక్ష హోదాలో ఉన్న చంద్రబాబు బిజెపి అభ్యర్థికి మద్దతు ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందని రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుని ఇద్దరూ తోడుదొంగలే వారి వారి కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే స్థాయికి చేరుకున్నారని జగన్, బాబులను విమర్శిస్తున్నారని అన్నారు. పోరాడే పార్టీ ఒక్క కాంగ్రెస్ పార్టీనే అని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చి రాహుల్ గాంధీ గారు ప్రధాని అయిన వెంటనే రాష్ట్రానికి తప్పకుండా ప్రత్యేక హోదా , విభజన చట్టంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తాడని ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మనసు మార్చుకుని ప్రతిపక్షాలు బలపరచిన రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా కి మీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఓటు వేయించాలని సుధాకర్ బాబు తెలియజేశారు.

# బన్నీ ఫ్యాన్స్ కి 'పుష్ప' టీమ్ గుడ్ న్యూస్!



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించిన హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'పుష్ప ది రైజ్'. స్టార్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన ఈ మూవీ భారీ స్థాయిలో గత ఏడాది డిసెంబర్ లో విడుదలై అనూహ్య విజయాన్ని సాధించింది. పాన్ ఇండియా వైడ్ గా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టడమే కాకుండా బన్నీని పాన్ ఇండియా స్టార్ ని చేసింది. పార్ట్ 1 దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఈ మూవీకి ఫ్రాంచైజీగా రానున్న పార్ట్ 2 పై సర్వత్రా అంచనాలు మొదలయ్యాయి.'కేజీఎఫ్ 2' సంచలన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని 'పుష్ప 2' స్క్రిప్ట్ విషయంలో భారీ మార్పులు చేశారట. బడ్జెట్ ని కూడా భారీగా పెంచేసినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఫస్ట్ పార్ట్ తో పోలిస్తే సెకండ్ పార్ట్ కు దాదాపు గా 400 కోట్లు ఖర్చు చేయబోతున్నారట. మరిన్ని ప్రత్యేక పాత్రలని పార్ట్ 2 కోసం జత చేస్తూ స్క్రిప్ట్ లో దర్శకుడు సుకుమార్ మార్పులు చేశారని తెలుస్తోంది. ఫస్ట్ పార్ట్ కోసం మిస్సయిన విజయ్ సేతుపతి ని సెకండ్ పార్ట్ కోసం తీసుకొస్తున్నారంటూ వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే.ఈ ఏడాది ప్రారంభం లోనే పార్ట్ 2 ప్రారంభం అవుతుందని భావించి ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ లో మార్పుల కారణంగా ఆలస్యం అవుతూ వస్తోంది. జూన్ లో స్టార్ట్ అన్నారు. అది కాస్తా జూలైకి మారిందని వార్తలు వినిపించాయి.కానీ ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుందని తెలుస్తోంది. సుకుమార్ ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ ని పూర్తి చేశారట. ఆగస్టు మూడవ వారంలో 'పుష్ప ది రూల్' షూటింగ్ ని ప్రారంభించబోతున్నారని తెలిసింది. గత కొన్ని రోజులుగా ఈ ప్రాజెక్ట్ ఎప్పెడెప్పుడు మొదలవుతుందా? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ కి ఇది నిజంగా గుడ్ న్యూసే.రెగ్యులర్ షూటింగ్ కి టైమ్ ని లాక్ చేసిన దర్శకుడు సుకుమార్ లొకేషన్స్ ని కూడా ఫైనల్ చేశారని ఫస్ట్ పార్ట్ కి అదిరిపోయే ట్యూన్స్ అందించిన దేవి శ్రీప్రసాద్ పార్ట్ 2 కోసం కూడా ట్యూన్స్ ని సిద్ధం చేసేశాడని తెలుస్తోంది. ప్రస్తుతం హీరో బన్నీ దర్శకుడు సుకుమార్ స్క్రిప్ట్ కి సంబంధించిన చర్చలలో పాల్గొంటున్నారట. ఇదిలా వుంటే రష్మిక పాత్రపై గత కొన్ని రోజులుగా రక రకాల వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆసరక్తికర వార్త ఒకటి బయటికి వచ్చింది.ఇందులోనూ రష్మిక పాత్ర కొనసాగుతుందని అల్లు అర్జున్ భార్య పాత్రలో రష్మిక కనిపిస్తుందని తెలుస్తోంది. భారీ బడ్జెట్ తో మరింత స్పెషల్ గా తెరపైకి రానున్న ఈ మూవీని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నరట. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన నటీనటుల ఎంపిక కూడా పూర్తయినట్టుగా చెబుతున్నారు. షూటింగ్ ప్రారంభానికి ముందే భారీ క్రేజ్ ని సొంతం చేసుకున్న ఈ మూవీకి బాలీవుడ్ కు చెందిన పలు క్రేజీ సంస్థలు భారీ ఆఫర్లు ఇస్తున్నారట. అయితే మైత్రీ వారు మాత్రం షేర్ విధానంలోనే ఈ మూవీని బాలీవుడ్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.

# అక్డీ పక్డీ.. ఫ్లోర్ స్టెప్పులతో రౌడీ స్టార్ ఇరగదీశాడు

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ వెర్సటైల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ ప్రాణం పెట్టి చేస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'లైగర్'. బాలీవుడ్ హీరోయిన్ అనన్య పాండే ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు పసరిచయం అవుతోంది. తెలుగుతో పాటు హిందీలోనూ ఒకేసారి షూటింగ్ జరుపుకున్న ఈ మూవీని పూరి కనెక్ట్స్ ధర్మా ప్రొడక్షన్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూరి చార్మిలతో కలిసి కరణ్ జోహార్ హీరూ జోహార్ ఈ మూవీని అత్యం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.దాదాపు రెండేళ్లుగా ఈ మూవీ కోసం పూరితో పాటు విజయ్ దేవరకొండ శ్రమించారు. భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీ ఆగస్టు 25న భారీ స్థాయిలో తెలుగు హిందీ తమిళ మలయాళ కన్నడ భాషలలో విడుదలకు రెడీ అవుతోంది. వరల్డ్ ఫేమస్ బాక్సర్ మైక్ టైసన్ కీలక అతిథి పాత్రలో నటిస్తున్న ఈ మూవీలో




రమ్యకృష్ణ రోనిత్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మూవీ రిలీజ్ కు టైమ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్ ని స్టార్ట్ చేసింది.ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ టీజర్ లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా 'అక్డీ పక్డీ ' అంటూ సాగే పార్టీ సాంగ్ ని విడుదల చేశారు. విజయ్ దేవరకొండ అనన్య పాండేలపై ఈ పాటని చిత్రీకరించారు. ఈ నెల 8న సాంగ్ ప్రోమోని రిలీజ్ చేసిన మేకర్స్ సోమవారం జూలై 11న ఫుల్ సాంగ్ ని రిలీజ్ చేశారు. లిజో జార్జ్ డీజే చేతాస్ ఈ పెప్పీ నంబర్ కు సంగీతం అందించగా భాస్కర భట్ల రవికుమారు సాహిత్యాన్ని అందించారు. అనురాగ్ కులకర్ణి రమ్య బెహెరా ఆలపించారు.విజయ్ దేవరకొండ నుంచి చాలా కాలంగా మాసీవ్ స్టెప్పులు ఆశిస్తున్న ఫ్యాన్స్ కి ఈ సాంగ్ ఓ ట్రీట్ ల వుంది. ఫ్లోర్ స్టెప్ లు హుక్ స్టెప్ లతో అనన్యతో కలిసి విజయ్ దేవరకొండ ఓ రేంజ్ లో స్టెప్పులేసి అదరగొట్టేశాడు. అ?య పాండే అందాలతో ఈ పాటకు మరింత గ్లామర్ ని జోడించి మరింతగా హీటెక్కించింది. మాసీవ్ విజిల్స్ వేస్తూ విజయ్ దేవరకొండ తొలి సారి వేసిన స్టెప్ లు మాస్ ఆడియన్స్ తో పాటు విజయ్ ఫ్యాన్స్ ని థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పాటలోని హుక్ లైన్ ని యువ సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ ఆలపించాడు. ఈ పాటలో విజయ్ అనన్యల జోష్ షూట్ చేసిన తీరు గ్రాండియర్ లుక్ ని బట్టి చూస్తుంటే ఈ ఇయర్ పార్టీ సాంగ్ గా పాపులర్ కావడం ఖాయం అని చెబుతున్నారు. ఈ పాటని ఐదు బాషల్లో విడుదల చేశారు. హిందీ వెర్షన్ సాంగ్ ని దేవ్ నేగి పావ్ని పాండే లిజో జార్జ్ డిజె చేతాస్ ఆలపించారు. సాహిత్యాన్ని మోహిసిన్ షేక్ అజీమ్ దాయాని అందించారు.తమిళ వెర్షన్ ని సాగర్ రాయగా వైష్ణవి కొద్దూరి సాగర్ ఆలపించారు. కన్నడ వెర్షన్ ని వరదరాజ చిక్కబల్లాపుర సాహిత్యం అందించగా సంతోష్ వెంకీ సంగీతా రవిచంద్రనాథ్ ఆలపించారు. మలయాళ వెర్షన్ ని విష్ణు వర్ధన్ శ్యామ ఆలపించగా సిజ్జు తిరువూర్ సాహిత్యాన్ని అందించారు. ఫస్ట్ లుక్ పోస్టర్ గ్లింప్స్ లతో 24 గంటల్లోనే రికార్డు సృష్టించిన ఈ మూవీ రీసెంట్ గా విడుదల చేసిన విజయ్ దేవరకొండ న్యూడ్ పిక్ తో మరింత వైరల్ గా సంచలనం సృష్టిస్తోంది. ఆగస్టు 25న ఐదు భాషల్లో భారీ స్థాయిలో రిఈజ్ అవుతున్న ఈ మూవీ ఏ స్థాయి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# చిరు 154లో క్రేజీ హీరో క్యారెక్టర్ ఇదేనా?

మెగాస్టార్ చిరంజీవి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే మూడు నాలుగు ప్రాజెక్ట్ లు చేస్తూ బిజీ బిజీగా గడిపేస్తున్నారు. రీసెంట్ గా 'ఆచార్య' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చిన చిరంజీవి ప్రస్తుతం మూడు భారీ ప్రాజెక్ట్ లలో నటిస్తున్నారు. తమిళ దర్శకుడు మోహన్ రాజా డైరెక్షన్ లో రూపొందుతున్న మూవీ 'గాడ్ ఫాదర్'. మలయాళ హిట్ ఫిల్మ్ 'లూసీఫర్' ఆధారంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది.ఈ మూవీని దసరాకు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాను. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఇక ఈ మూవీతో పాటు తమిళ హిట్ మూవీ 'వేదాలం' ఆధారంగా తెరకెక్కుతున్న 'భోళా శంకర్'లో నటిస్తున్నారు. సిస్టర్ సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో చిరుకు సిస్టర్ గా క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్ నటిస్తున్న విషయం తెలిసిందే. మెహర్ రమేష్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని త్వరలోనే ప్రేక్షకుల



ముందుకు తీసుకురాబోతున్నారు.దిలా వుంటే ఈ సినిమాలతో పాటు మెగాస్టార్ స్ట్రెయిట్ స్టోరీతో 154వ ప్రాజెక్ట్ ని యంగ్ డైరెక్టర్ బాబితో చేస్తున్నారు. క్రేజీ ప్రొడక్షన్ కంపనీ మైత్రీ మూవీమేకర్స్ ఈ భారీ సినిమాని నిర్మిస్తోంది. 'వాల్తేరు వీరయ్య' నే టైటిల్ ని ఫైనల్ చేయబోతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ జరుగుతోంది. ఈ మూవీ లేటెస్ట్ షెడ్యూల్ ని జూలై 13 నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ మూవీలో మాస్ మహారాజా రవితేజ కీలక పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే.గత కొంత కాలంగా తన పాత్రకు సంబంధించిన వార్తలకు చెక్ పెడుతూ చిత్ర బృందం జూలై 13న ప్రారంభం కాఉన్న తాజా షెడ్యూల్ ని రవితేజ చిరంజీవిలపై ప్లాన్ చేసిందట. ఈ షెడ్యూల్ లో ఈ ఇద్దరు పాల్గొనగా కీలక ఘట్టాలని చిత్రీకరించబోతున్నారట. తాజా వార్తల ప్రకారం ఇందులో రవితేజ మెగాస్టార్ చిరంజీవికి సోదరుడిగా కనిపించబోతున్నారట. తన వయసుకు తగ్గ పాత్రలో ఓ భార్య పిల్లాడితో కలిసి శ్రీలంకలో జీవించే వ్యక్తిగా పవర్ ఫుల్ పాత్రలో రవితేజ కనిపించనున్నారట.అంతే కాకుండా జూలై 18 వరకు ఓ మాసీవ్ సాంగ్ ని చిరు ఇంట్రో సాంగ్ గా షూట్ చేయబోతున్నారని తెలిసంది. మాస్ మహారాజా రవితేజ గతంలో చిరంజీవి నటించిన 'అన్నయ్య' మూవీలో తమ్ముడిగా నటించాడు. మళ్లీ ఇన్నాళ్లకు అదే తరహా పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఇందులో చిరుకు జోడీగా శృతిహాసన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా వుంటే మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ 'రామారావు ఆన్ డ్యూటీ' జూలై 29న వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శరత్ మండవ తెరకెక్కించిన ఈ మూవీని సుధాకర్ చెరుకూరి నిర్మించారు.

# వన్డే సిరీస్ రద్దు.. దక్షిణాఫ్రికాకు భారీ షాక్! ప్రపంచకప్ రేసు నుంచి తప్పుకొన్నట్లేనా?



దేశవాళీ టీ20 క్రికెట్ లీగ్ నేపథ్యంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం ప్రొటీస్ ప్రపంచకప్-2023 టోర్నీ అర్హత అవకాశాలను తీవ్రంగా దెబ్బతీయనుంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను రద్దు చేసుకునే పరిస్థితులు తలెత్తిన తరుణంలో వరల్డ్‌కప్ ఈవెంట్‌లో నేరుగా అడుగుపెట్టే అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. కాగా దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 17 వరకు ప్రొటీస్ జట్టు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. అయితే, తమ దేశంలో కొత్తగా టీ20 దేశవాళీ క్రికెట్ లీగ్ నేపథ్యంలో షెడ్యూల్‌ను మార్చాల్సిందిగా దక్షిణాఫ్రికా బోర్డు.. ఆసీస్ బోర్డుకు విజ్ఞప్తి చేసింది.కానీ, ఇప్పటికే కంగారూల క్యాలెండర్ వివిధ అంతర్జాతీయ మ్యాచ్‌లతో బిజీగా ఉన్న కారణంగా రీషెడ్యూల్ చేసేందుకు వీలుపడదని ఆసీస్ బోర్డు స్పష్టం చేసింది. ఈ క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రొటీస్ బోర్డు ఆసీస్‌తో వన్డే సిరీస్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.కాగా ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సూపర్‌లీగ్ పాయింట్ల పట్టికలో పదకొండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికాకు మెగా ఈవెంట్ ఎంట్రీ సంక్లిష్టతరం కానుంది. వచ్చే ఏడాది భారత్ వేదికగా జరుగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీ జరుగనున్న విషయం తెలిసిందే.సూపర్‌లీగ్‌లో టాప్-8లో నిలిచిన జట్లు ఈ ఈవెంట్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. దక్షిణాఫ్రికా పరిస్థితి ఇలా ఉంటే ఆస్ట్రేలియా ఇప్పటికే 70 పాయింట్లతో ఎనిమిదో స్థానానికి చేరుకుంది. జింబాబ్వేతో టూర్ నేపథ్యంలో మరో మూడు వన్డేలు ఆడనుంది కూడా! దీంతో దక్షిణాఫ్రికా సిరీస్ రద్దు చేసుకున్న కారణంగా కంగారూలకు పెద్దగా నష్టమేమీ లేదు! ఈ విషయంపై స్పందించిన క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ మాట్లాడుతూ.. "జనవరిలో జరగాల్సిన వన్డే సిరీస్ నుంచి దక్షిణాఫ్రికా తప్పుకోవడం నిరాశ కలిగించింది.అయితే, మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ మాత్రం యథావిధిగా జరుగుతుంది. మా షెడ్యూల్ బిజీగా ఉన్న కారణంగానే వన్డే సిరీస్‌ను రీషెడ్యూల్ చేసే పరిస్థితి కనిపించడం లేదు" అని పేర్కొన్నారు. మొత్తం 13 దేశాలు పాల్గొనే ఈ సూపర్ లీగ్‌లో 12 ఐసీసీ పూర్తిస్థాయి సభ్యత్వం కల్గిన దేశాలతో పాటు నెదర్లాండ్స్ పోటీ పడనుంది. ఈ క్వాలిఫికేషన్ రౌండ్‌కు నెదర్లాండ్స్ గతంలోనే అర్హత సాధించింది. 2015-17లో నిర్వహించిన ఐసీసీ వరల్డ్ క్రికెట్ సూపర్ లీగ్‌లో విజేతగా నిలవడం ద్వారా నెదర్లాండ్స్ వరల్డ్‌కప్- 2023 క్వాలిఫికేషన్ రేసులో నిలిచింది. మరో రెండు దేశాల కోసం క్వాలిఫికేషన్ రౌండ్ నిర్వహిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**